www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు®

Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం





# తిరుపతి సమగ్రాభివృద్ధికి శ్రీకారం

- రూ.3,222 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులు
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఔట్ పనుల ప్రారంభం
- వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తుడా-టీటీడీ చేపడుతున్న అభివృద్ధి పనులకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

**అమరావతి, మహానాడు:** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల-తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం రూ.2,750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కింగ్, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తుల వసతి కోసం రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు.

వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంది. తిరుమల కొండపై వసతులపై ఒత్తిడిని తగ్గించడంతోపాటు, తిరుపతిలోనే భక్తులకు మెరుగైన మిగతా.. 2లో


3

ఫిర్యాదుల పరిష్కారంపై

## నిర్లక్ష్యం వద్దు

ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## తిరుపతికి భారీ ఇన్ ఫ్రా ప్రాజెక్టులు



ముఖచిత్రం మార్చేస్తున్న చంద్రబాబు


5

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్-చోరీకి మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

- ఇది మరో స్వాతంత్ర్య పోరాటం
- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలిసి కదం తొక్కాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం




**ఢిల్లీ:** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు.

ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు.

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేద్కర్ మిగతా.. 8లో

## మేయర్లుగా మహిళలకు, బీసీలకు పెద్దపీట!



**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ పదవుల రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ పరిపాలనా మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీవోను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్లకు జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మేయర్ పదవుల కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి:

**కేటగిరీల వారీగా రిజర్వేషన్ల వివరాలు (షెడ్యూలు 1):**

షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ): 1 స్థానం
షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ): 2 స్థానాలు
వెనుకబడిన తరగతులు (బీసీ): 5 స్థానాలు
మహిళలు (జనరల్): 5 స్థానాలు
అన్‌రిజర్వుడ్ (ఎన్?రిజర్వుడు): 4 స్థానాలు
మొత్తం కార్పొరేషన్లు: 17 మిగతా.. 2లో




## 106 పురపాలక సంఘాల చైర్మన్ రిజర్వేషన్లు ఖరారు

- ఎస్టీలకు 3, ఎస్సీలకు 14, బీసీలకు 36 స్థానాలు
- జనరల్ మహిళలకు 27, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 26 పురపాలక సంఘాలు

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలోని 106 పురపాలక సంఘాల చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఇందులో ఎస్టీలకు 3, ఎస్సీలకు 14, బీసీలకు 36 స్థానాలు కేటాయించారు. జనరల్ మహిళలకు 27, అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో 26 స్థానాలు కేటాయించారు. ఆయా కేటగిరీల వారీగా పురపాలక సంఘాల వివరాలు ఇలా ఉన్నాయి. మిగతా.. 2లో





## పెట్టుబడులకు, ప్రగతికి.. ఏపీ స్వర్గధామం

- పెట్టుబడిదారులు రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేస్తారనేది మా ప్రాధాన్యం
- జాతి కోసం, దేశం కోసం పారిశ్రామికవేత్తలు ఆలోచించాలి
- సింగపూర్ తరహాలో సమష్టి శ్రమతో విజయం సాధ్యం
- ఐక్యంగా ఆంధ్రప్రదేశ్ పురోగతిలో భాగస్వాములు అవుదాం
- పరిశ్రమలు మొదటి రోజు నుంచే పర్యావరణం మీద దృష్టిపెట్టాలి
- అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది
- కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**కాకినాడ, మహానాడు:** 'గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో మీరు పరిశ్రమ పెడితే.. మాకేమిస్తారు..? అని అడిగే విష సంస్కృతి అప్పట్లో ఉండేది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి దారులకు రాష్ట్రాన్ని స్వర్గధామంగా మారుస్తోంది. మీరు పెట్టుబడులు మిగతా.. 2లో

### రూ.50 వేల కోట్ల అవినీతి సంపాదనలో భాగంగానే ఈ స్కూల్‌లో పెట్టుబడులు పెట్టారా?



రూ.2.5 లక్షల ఫీజు వసూలు చేస్తూ విద్యార్థులపై భారం మోపాలని చూస్తున్నారా?

విద్యను వ్యాపారం చేయొద్దన్న సీఎం రేవంత్ ఇప్పుడు వారి కుమార్తె కార్పొరేట్ స్కూల్ ఎందుకు నిర్మాణం చేస్తున్నారో సమాధానం చెప్పాలి

సీఎం రేవంత్ కుమార్తె ఎనుముల నైమిశా రెడ్డి నిర్మాణం చేస్తున్న కార్పొరేట్ స్కూల్ ఎదుట మన్నె క్రిషాంక్ బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రెస్ మీట్

8 లో




### నిజంగానే "సాక్షి"కి గుండెపోటు వచ్చింది!

7 లో




# 3,296 కోట్ల రేడియల్-2 నిర్మాణ టెండర్లలో భారీ అవినీతి

- సీఎం రేవంత్ శాఖలోనే అక్రమాలు
- నన్ను టెండర్లలో పాల్గొనవద్దని సీఎంఓ నుంచి ఫోన్లు చేశారు
- 600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా నిబంధనల పేరిట తప్పించారు
- దీన్ని రాహుల్ దృష్టికి తీసుకువెళతా
- సీఎం రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన ఆరోపణలు



**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మరోసారి రోడ్డెక్కాయి. అసమ్మతి నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈసారి నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి శాఖపైనే ఆరోపణాస్త్రాలు సంధించారు. 600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తన కంపెనీకి టెండరు దక్కకుండా సీఎంఓనే తమ కంపెనీని నిబంధనల పేరిట పక్కనపెట్టిందని కోమటిరెడ్డి ఆరోపించారు. తనను టెండరులో పాల్గొనవద్దని సీఎంఓ నుంచే ఫోన్లు వచ్చాయని వెల్లడించారు.

స్వయంగా సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని, దీనిని తాను రాహుల్ దృష్టికి తీసుకువెళతానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితిలో తాను ఢిల్లీలో జరిగే ఆందోళనకు ఎలా హాజరవుతానని ప్రశ్నించిన రాజగోపాల్‌రెడ్డి.. పార్టీలోనే ఉంటూ ఇలాంటి అవినీతిపై పోరాడతానని వెల్లడించారు. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో సంచలనం సృష్టిస్తున్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మిగతా.. 8లో


03

ఏడాది పాటు శాంతికి భంగం కలిగించవద్దు


08

యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి


07

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు.. తెలంగాణలో బీజేపీకి నిర్బంధాలా?


06

రైతులు కరవుతో చస్తుంటే ఢిల్లీకి రేవంత్ పరార్

# కుప్పంలో కృష్ణానదీ జలాలు పారుతుంటే మరి నువ్వెందుకు నీళ్లు ఎత్తుతలేవు?

- నీ గురువు గారికి గురుదక్షిణ చెల్లిస్తున్నవా?
- ఏపీలో లేని కరువు తెలంగాణలో ఎందుకు ఉంది?
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్




**హైదరాబాద్:** చంద్రబాబు నాయుడు కృష్ణానదీ జలాలను 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో తన నియోజకవర్గంలో నీళ్లు పారిస్తున్నడు. మరి అదే కృష్ణాలో నువ్వెందుకు నీళ్లు ఎత్తుతలేవు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నువ్వు విడిచిపెడితే చంద్రబాబు ఒడిసి పడ్తున్నడు. 700 కిలోమీటర్ల దూరంలో ఇవాళ కుప్పంలో గళగళా కృష్ణానదీ జలాలుపారుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు నాయుడు జలహారతి ఇస్తున్నాడు. అంటే నీ గురువు గారికి గురుదక్షిణ చెల్లిస్తున్నవా? రేవంత్ రెడ్డి అని ఫైర్ అయ్యారు.

నిన్న చంద్రబాబు ట్వీట్.. మిగతా.. 6లో

## అవి పోయి ఇది వచ్చే ధాం ..ధాం..ధాం

(డా.బాత్రిసు -9884675329)

మా చిన్న తనంలో అచ్చ తెనుగు రైమ్స్ళిఅనుక్రమణరి ఉండేవి వాటిలో అందరికీ తెలిసింది

- ఉడత పోయి ఎలుక వచ్చే ధాం ధాం ధాం,ఎలుక పోయి పిల్లి వచ్చే ధాం ధాం ధాం,పిల్లి పోయి కుక్క వచ్చె ధాం ధాం ధాం,కుక్క పోయి ఎద్దు వచ్చే ధాం ధాం ధాం,ఎద్దు పోయి ఒంటే వచ్చే ధాం ధాం ధాం ,ఒంటె పోయి గుర్రం వచ్చే ధాం ధాం ధాం,గుర్రం పోయి గాడిద వచ్చే ధాం ధాం ధాం,గాడిద పోయి నక్క వచ్చె ధాం ధాం ధాం,నక్క పోయి చిరుత వచ్చే ధాం ధాం ధాం,చిరుత పోయే సింహం వచ్చే ధాం ధాం ధాం,సింహం పోయి ఏనుగు వచ్చె ధాం ధాం ధాం,ఏనుగు పోయి నేను వచ్చే ధాం ధాం ధాం అనేది .

ఇది నేటి అన్ని రంగాలకు వర్తించే అర్ధవంతమైన అనుక్రమ సాహిత్యం.అయితే ఈ కథనంలో నేటి వెర్రి తలలలు వేస్తున్న ఉపయోగం లేని ఆరోగ్యాన్ని పాడు చేసే సాంకేతిక పరిజ్ఞానం గురించి పైని అనుక్రమణ సాహిత్యం నేరుగా అర్ధం అయ్యేలా వివరిస్తుంది. కట్టెల పొయ్యి నుంచి మొదలైన మన వంట ఇల్లు ,కుంపట్లు,



కిరోసిన్ స్టవ్ లు,గ్యాస్ స్టవ్‌లు, మైక్రో ఓవెన్ లు.ఎలక్ట్రిక్ పాన్‌లు, దాకా వచ్చి నేడు కొత్తగా ఎయిర్ ఫ్రై పొయ్యిల దగ్గర ప్రస్తుతం ఆగింది. మన పురాణాల్లో నలుడుకి అష్ట దిక్పాలకులు ఇచ్చిన వరం కారణంగా అయన పొయ్యి వెలిగించి కుండానే అగ్ని దేవుడిని తలిస్తే కట్టెలు వాటంతట మిగతా.. 2లో

## పులివెందుల: ఒక హత్య... ఆరు మరణాలు... తేలని క్లైమాక్స్

- మిస్టరీ గుండ్లవాగు శంకర్ - ఈడీ విచారణ!
- నిశ్శబ్దం వెనుక తుఫాను

(చాకిరేవు)

రాయలసీమ గడ్డలో పులివెందుల. ఇక్కడ రాజకీయం అంటే ప్రసంగాలు కాదు, లెక్కలు, గుసగుసలు, ఎప్పుడు ఎటు తిరుగుతాయో తెలియని సమీకరణాలు. ఆ నేలపై జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. కథ ముగిసిందనుకున్న చోటే కొత్త అధ్యాయం మొదలైంది.

**ఈడీ ఎంట్రీ: "ఫాలో ది మనీ"**

హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం. సీబీఐ దర్యాప్తును ఆధారంగా చేసుకుని, పీఎంఎల్ఏ చట్టం



కింద మనీలాండరింగ్ కోణంలో ఈడీ రికార్డులను పరిశీలిస్తోంది. ఈ కేసులో ఏ-5గా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. హత్యకు ముందు, వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలు, సునీల్ యాదవ్, ఎర్రగంగిరెడ్డి, దస్తగిరి పాత్రలపై అధికారులు ఆరా తీస్తున్నారు. మిగతా.. 2లో

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
మహానాడు ®
Mahanaadu Media


డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026 ||

# పెట్టుబడులకు, ప్రగతికి.. ఏపీ స్వర్గధామం

మొదటి పేజీ తరువాయి..

పెడితే రాష్ట్రానికి ఏం ఇస్తారు..? ప్రజలకు ఏం చేస్తారు అని అడిగి సత్సంప్రదాయంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిశ్రమలకు రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయి. వాటిని అందిపుచ్చుకొని, ఆంధ్రప్రదేశ్ పురోగతిలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూలో సోమవారం జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "విశ్రాంత ఉద్యోగుల ప్యారడైజ్ నగరంగా భావించే కాకినాడలో తొలిసారి సీఐఐ ప్రాంతీయ సదస్సు జరగడం ఆనందంగా ఉంది. విశాఖపట్నం తర్వాత రాష్ట్రంలో రెండో ప్రాంతీయ సదస్సుకు కాకినాడ వేదిక కావడం గొప్ప మైలురాయి. కాకినాడ పారిశ్రామిక ప్రగతి చరిత్రలో రూ.6,347 కోట్ల పెట్టుబడులు రావడం కొత్త అవకాశాలకు పునాది వేస్తుంది. ఈ ప్రాంతం మరింత పురోగతి చెందడానికి ఇది ఇంధనంగా పని చేస్తుంది.

### 18 వేల మందికి ఉపాధి

16 ఎంఓయూల ద్వారా రూ.4,652 కోట్లు పెట్టుబడులు, రూ.2,090 కోట్లతో పూర్తయిన 4 ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం శుభసూచకం. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో 18 వేల మందికి ఉపాధి లభించనుంది. ఇది యువతకు ఉపాధి భరోసాను ఇవ్వడంతోపాటు ఎన్నో కుటుంబాలకు ఓ ఆసరాను చూపించే గొప్ప కార్యక్రమంగా నిలిచిపోతుంది.

### సింగపూర్ ఎదిగిన క్రమం మనకు స్ఫూర్తి

1965 ప్రాంతంలో సింగపూర్ అనే దేశం అత్యంత పేద దేశం. కనీస అవసరాలు తీర్చుకోవడానికి, దేశం ముందుకు వెళ్లడానికి సరైన అవకాశాలు లేని స్థితి నుంచి తన అభివృద్ధి ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ సంకల్ప బలంతో, సమష్టి కృషితో ఈనాటి ప్రపంచంలో అద్భుతమైన దేశంగా మారింది. స్విట్జర్లాండ్ దేశ నమూనా కూడా అలాంటిదే. మనలో స్పష్టత, ఐక్యత, జాతీయత ఉంటే కచ్చితంగా దేశాన్ని పురోగమన దిశగా ముందుకు తీసుకెళ్లవచ్చు. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకరించేందుకు, వారిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. వారికి తగిన ప్రోత్సాహకాలు, అనుమతులు త్వరితగతిన ఇస్తున్నాం. పారిశ్రామికవేత్తలు కూడా అదే నిబద్ధతతో, పర్యావరణ హితంగా యువతకు మెరుగైన ఉపాధి చూపుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి.

### జంషెడ్జీ టాటా దేశాన్ని ముందుకు నడిపారు

పారిశ్రామికవేత్తలు కేవలం లాభం లెక్కలు మాత్రమే వేయకుండా మనతో పాటు దేశం, జాతిని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం చేసుకోవాలి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ ద్వారా సమాజానికి మేలు చేయాలనే ఆలోచన ఎల్లవేళలా ఉండాలి. భారతదేశ అభివృద్ధికి జంషెడ్జీ టాటా చేసిన ఎన్నో కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన కేవలం పరిశ్రమలంటే లాభాలు ఆర్జించే మార్గాలుగానే కాకుండా, జాతిని ముందుకు నడిపించే ఇంధనాలుగా భావించారు. ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వర్తించారు. అలాంటి వారు మనకు ఎల్లవేళలా స్ఫూర్తిగా నిలుస్తారు. పెట్టుబడుల రాక, పరిశ్రమల స్థాపన అనేది కేవలం లెక్కల కింద, పారిశ్రామిక ప్రగతి కింద మాత్రమే చూడకూడదు. ఇది వేలాది కుటుంబాల జీవనశైలిని మార్చబోయే భరోసాగా భావించాలి.

గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గదర్శకంలో, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2024, జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు పూర్తయితే, రూ.4.7 కోట్ల ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. వీటి వల్ల రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగాలు యువతకు రానున్నాయి.

### తీర ప్రాంతం రాష్ట్రానికి వరం

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం అంటే కేవలం ఒప్పందాలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు.. వాటిని పూర్తిస్థాయిలో ప్రారంభించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ప్రాజెక్టుల రాకకు, పెట్టుబడుల విస్తృతం చేయడానికి, ప్రారంభానికి అన్ని రకాల అనుమతులను పారదర్శకంగా, వేగంగా ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను చక్కగా నిర్వర్తిస్తోంది. దీనివల్లనే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు ప్యారడైజ్‌గా మారింది.

కాకినాడ పేరు చెప్పగానే శ్రమజీవుల వేదికగా గుర్తుకొస్తుంది. కార్మికులు, కర్షకులు, మత్స్యకారులు, వేతన జీవులు అధికం. అవకాశం అందిపుచ్చుకునే యువత ఉన్నారు. మార్పును అందిపుచ్చుకునే సామర్థ్యం కాకినాడకు ఉంది. మారిటైమ్ బోర్డు పరిశ్రమలు, నౌక నిర్మాణ పరిశ్రమలు, గ్రీన్ హైడ్రోజన్, రసాయన, ఆహార శుద్ధి, ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలు రాబోతున్నాయి. వచ్చే పరిశ్రమలన్నీ ప్రపంచంతో అనుసంధానమై, ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచమంతా తీసుకెళ్లే అవకాశం ఉన్నవి. ఆంధ్రప్రదేశ్‌కు 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఓ వరం. దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, తీరం రక్షణ అంతే ప్రధానం. దీనికి పరిశ్రమలు తగిన విధంగా సహకరించాలి. గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. పచ్చదనం పెంపు, పర్యావరణహితమైన పారిశ్రామిక అభివృద్ధి రాష్ట్రానికి ప్రధానం. తీర ప్రాంత రక్షణ, అక్కడ జీవుల మనుగడ, అభివృద్ధిపైన ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుంది.

### పల్లెల వైపు పెట్టుబడులు రావాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సౌకర్యాలు పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో పల్లె పండుగ, అడవితల్లి బాట పేరుతో చేస్తున్న కార్యక్రమాలు గ్రామాలు, గిరిజన ఆవాసాలకు సౌకర్యాల కళను తీసుకొస్తున్నాయి. రూ.1.70 లక్షల కోట్లతో పల్లెలు, ఏజెన్సీల్లో ముమ్మరంగా రోడ్లు, డ్రైన్లు, అనుసంధాన దారులు, ఇతర సౌకర్యాలను పెంచే కార్యక్రమం చేస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో కూడా తమ దృష్టి నిలిపి, పరిధిని విస్తరించాలని కోరుతున్నాను. దీనిద్వారా అన్ని ప్రాంతాలకు అభివృద్ధి విస్తరించడం సులభం అవుతుంది. తద్వారా గ్రామాలకు కొత్త అవకాశాలను సృష్టించడం సులభం అవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో నూతన పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టేముందు పారిశ్రామికవేత్తలు భూమి గురించో, సౌకర్యాల కల్పన, అనుమతులు గురించో కాదు.. సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన చూస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రభుత్వం మీద నమ్మకంతో వారు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఎక్కడైతే ప్రశాంతమైన పరిస్థితులు, వృద్ధి చెందడానికి అవకాశాలు ఉంటాయో అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

గత ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి రాకపోగా, ఉన్న పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుస్థిరమైన ప్రగతిని సాధిస్తూ, యువతకు ఉపాధిని చూపుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ అభివృద్ధి అనేవి జోడెద్దులుగా ముందుకు సాగితేనే రాష్ట్రం అన్ని విధాలుగా నూతన కళను సంతరించుకుంటుంది.

### రండి.. రాష్ట్ర ప్రగతిలో భాగం పంచుకోండి

రాష్ట్రంలోకి ఎంతో ఉత్సాహంతో వస్తున్న పెట్టుబడిదారులకు నేను చెప్పేది ఒకటే. రండి.. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో మాతో కలిసి నడవండి.. ప్రజల ఉన్నతి కోసం పనిచేయండి. స్థానిక పెట్టుబడులతో యువతకు ఉపాధి నైపుణ్యాలను కల్పించి ఉద్యోగాలు వస్తాయి. వ్యాపారులకు వ్యాపారం జరుగుతుంది. గ్రామీణులు, మత్స్యకారులతోనూ పనిచేసే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు పెడుతున్న మొదటిరోజు నుంచే పర్యావరణ హితమైన పారిశ్రామిక అభివృద్ధి అనే కోణంలోనే ముందడుగు వేయండి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రంగం అభివృద్ధి చెందేలా, ప్రతి వర్గం ఉన్నతి సాధించేలా ఓ సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. దీనిలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అవి పోయి ఇది వచ్చే ధాం ..ధాం..ధాం

మొదటి పేజీ తరువాయి..

అవి అగ్నిని పొంది మండేవి.అల కట్టెలు,బొగ్గుల కుంపటి పైన వండిన వంట అత్యంత రుచిగా,నాలుగు రోజుల పాటు చెడిపోకుండా,రుచి పోకుండా చక్కగా ఉండేవి. ఆ రోజుల్లో ఫ్రిడ్జిలు లేకున్నా సరే. మా అమ్మ గారు కుంపటి పైన పప్పు చారు పెడితే ఖచ్చితంగా నాలుగు రోజులు ఎటువంటి వాసన కొట్టకుండా కమ్మగా ఉండేది దాన్ని అపురూపంగా లొట్టలు వేసుకుంటూ తినేవాళ్ళం.సరే ఇక మన కార్పొరేట్ దిగ్గజాలు చేసే మోసపూరిత సాంకేతిక పరికరాల వ్యాపార కథనంలోకి వెళ్ళిపోదాం.

### వారి అతి తెలివి కొంప ముంచిందా?

అమెరికన్ టెక్ సంస్థలు తయారు చేసిన మైక్రోవేవెన్ వాళ్ళ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది కోట్ల వ్యాపారం జరిగింది.అయితే వారి ప్రజలకే కాకుండా దాన్ని ఉపయోగించిన ప్రపంచ ప్రజలకు పేగు,రెక్టర్ క్యాన్సర్ ప్రబలాయి.జరగాల్సిన నష్టం సంఖ్య పెరుగుతున్నా కూడా ఇంకా మూడో ప్రపంచ దేశాల్లో వీటి వినియోగం అధికంగా ఉండటం విచారకరం. పనికిరాని పనిముట్లు కనిపెట్టి వాటిని ప్రపంచ లోకి వదలడంలో అమెరికన్లదే పై చేయి.అమెరికా వ్యాపార సరళిలో చూస్తేనే మనకు ఈ విషయం బాగా అర్థం అవుతుంది. వారి దృష్టిలో అమ్మే ఉత్పత్తికి విలువ లేదు కానీ వినియోగదారుడు ఇచ్చే ఒక డాలర్ కి మాత్రం వాళ్ళు దాసోహం అంటారు. ఎలాగంటారా ? మూడు చీపురు కట్టలు ఒక డాలర్ అనే బోర్డు చూసి లోపలికి వెళితే షాప్ వాడు మూడు కొంటేనే ఒక డాలర్ మీకు ఒకటి కావాలని ఒక డాలర్ చెల్లించాల్సిందే అని చెబుతారు.

దీని లో మర్మ ఏమంటే వాడు అమ్మే చీపురు ఏ మాత్రం నాణ్యత లేనిదని.వారి తెలివిని చూసి అబ్బుర పోయిన మన వ్యాపారులు సందట్లో సడేమియా చందాన కిలో బట్టలు ఇంత మాత్రమే అంటూ అమ్ముడుపోని పాత స్టాక్ మొత్తం ఆషాడం సేల్ పేరుతో అమ్మేయడం ,దానికి మన ఆడంగులు ఎగబడటం ప్రతి ఏటా చూసి మనం ఆనందిస్తూనే ఉన్నాం. జెనిటికల్ మాడిఫై సాంకేతిక తయారైన వంగ,మొక్క జొన్న తదితర ఇతర ఆహార దినుసుల విత్తనాలు తమ వద్దనే కొనాలని ట్రంప్ మన పైన ఒత్తిడి తేవడానికి కారణం ఆలోచించారా. అవి కొని పండించి తింటే ఇంతే సంగతులు మరి ప్రజలకు లేనిపోని రోగాలు పెరిగి కార్పొరేట్ ఆసుపత్రులకు,ఫార్మా కంపెనీలకు కాసులే..కాసులు వెరసి ఈ కాసుల్లో అమెరికా దేశపు వాటా తప్పనిసరిగా ఉంటుంది.

### ఏమిటీ ఎయిర్ ఫ్రైయింగ్ వంటలక్క..?

అమెరికా-ఇరాన్ యుద్ధం పుణ్యం వల్ల డచ్ కార్పొరేట్ వ్యాపార దిగ్గజాల పంట పడింది.దీని ఫలితంగా ఎయిర్ ఫ్రైయింగ్ వంటలక్క ఎయిర్ ఫ్రేయర్ రూపంలో నేడు ప్రపంచమంతా తిరుగుతోంది.2010 లో మొదటి వ్యాపార సరళి ఎయిర్ ఫ్రేయర్ మార్కెట్లోకి వచ్చినప్పుడు దాన్ని కొన్న వారు రెస్టారెంట్ల యజమానులు మాత్రమే.కొత్తొక వింత చందాన అప్పట్లో దీన్ని చాలా మంది ఆదరించారు కానీ నేటి యుద్ధ సమయంలోనే ఈ వంటలక్క చేసే హాని గురించి బయటకు వచ్చింది..తల నొప్పులు,కండరాల పటుత్వం క్షీణించడం,నాటి సంబంధిత రుగ్మతలు ఈ వంటలక్క మనకు ఇచ్చే బోనస్ గిఫ్ట్ లని తెలుసుకోండి ఇందులో వండిన ఒక సర్వింగ్ ఫ్రెంచ్ ఫ్రైస్ లేదా ఒక ప్లేట్ ఫ్రైడ్ చికెన్ తినగానే, ఆ సుపరిచితమైన కరకరలాడే శబ్దం, లోపల మెత్తగా, నమలడానికి వీలుగా ఉండేఆ తీపి అనుభూతి వెంటనే మీ రుచి మొగ్గలను తాకుతుంది.

కానీ వేయించిన ఆహారాల ఆకర్షణీయమైన రుచికి మనం ఆరోగ్య పరమైన ఒక మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. వాటిని వండడానికి ఉపయోగించే నూనెలకూ, గుండె జబ్బులు, టైప్ 2 మధుమేహం, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలకూ సంబంధం ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కొవ్వు, కేలరీలు లేకుండా నూనెలో వేయించిన ఆహారాల రుచి, ఆకృతి, బంగారు గోధుమ రంగును అందిస్తాయని వాగ్దానం చేస్తూ ఎయిర్ ఫ్రయ్యర్‌లు రంగ ప్రవేశం చేశాయి.కానీ డీప్ ఫ్రయ్యర్‌లకు ప్రత్యామ్నాయంగా వచ్చిన ఇవి తమ వాగ్దానాన్ని నెరవేరుస్తున్నాయా? అంటే లేదని చెప్పాలి. కొవ్వు అధికంగా ఉండే ఆహారాన్ని ఎయిర్ ఫ్రైయర్‌లో వండినా, ఇతర పద్ధతుల్లో వండిన దానికంటే ఏమాత్రం ఆరోగ్యకరంగా ఉండదు. ఎయిర్ ఫ్రైయింగ్‌లో ఎక్కువ లోపాలు కూడా ఉన్నాయి, ఉదాహరణకు, దాని తయారీకి ఉపయోగించే పదార్థాలను బట్టి, కొన్ని ప్లాస్టిక్ విషపదార్థాలు ఆహారం లోకి చేరే అవకాశం ఉంది. కాబట్టి, ఎయిర్ ఫ్రైయర్‌లు వాడటానికి పాక్షిక సురక్షితమైనవే అయినప్పటికీ, వాటిని మాత్రమే ఉపయోగించవద్దు.

**అక్రిలమైడ్ ఏర్పడటం:** బంగాళాదుంపలు- బ్రెడ్ వంటి పిండి పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలను 120°C (248°F) కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో వండటం వల్ల అక్రిలమైడ్ ఏర్పడుతుంది. జంతువులపై జరిపిన అధ్యయనాలలో ఈ రసాయనానికి క్యాన్సర్‌తో సంబంధం ఉన్నట్లు తేలింది. ఎయిర్ ఫ్రయ్యర్లు తరచుగా మొత్తం కొవ్వును తగ్గించినప్పటికీ, ఆహారం ఎక్కువగా ఉడికినా లేదా మాడిపోయినా అవి ఇప్పటికీ అక్రిలమైడ్‌ను ఉత్పత్తి చేయగలవని పరీక్షలు నిర్ధారించాయి. హానికరమైన సమ్మేళనాలు: అధిక ఉష్ణోగ్రతల వల్ల చేపల వంటి జంతు ప్రోటీన్లలో అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రొడక్ట్స్ (AGEs), పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ (PAHs), మరియు కొలెస్ట్రాల్ ఆక్సీకరణ ఉత్పత్తులు (COPs) ఉత్పత్తి అవుతాయి. ఇవి వాపు - గుండె సమస్యలతో ముడిపడి ఉంటాయి.న్ నాన్-స్టిక్ కోటింగ్ క్షీణత:గ్రాఫీజు/టెఫ్లాన్ వంటి గీతలు పడిన లేదా దెబ్బతిన్న నాన్-స్టిక్ ఉపరితలాలు అధికంగా వేడెక్కడం వల్ల విషపూరిత పొగలు విడుదల కావచ్చు. ఈ ఆవిరిని పీల్చడం వల్ల చలి, జ్వరం మరియు తల నొప్పితో కూడిన ఫ్లూ లాంటి ప్రతిచర్య అయిన "పాలిమర్ ఫ్యూమ్ ఫీవర్" ప్రేరేపించబడుతుంది.యాంత్రిక - విద్యుత్ ప్రమాదాలు: అధిక వేడి లేదా విద్యుత్ లోపాల వల్ల అప్పుడప్పుడు ప్లాస్టిక్ భాగాలు వంగిపోవడం, యూనిట్ల నుంచి పొగ రావడం, లేదా గ్రీజు పేరుకుపోతే అగ్ని ప్రమాదాలు సంభవించవచ్చు.ఈ కారణాల దృష్ట్యా మన దేశపు వంటి ఇళ్లకు ఈ వంటలక్క ఏ మాత్రం సరైన సహాయకారి కాదు.

# తిరుపతి సమగ్రాభివృద్ధికి శ్రీకారం

మొదటి పేజీ తరువాయి..

సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అన్నదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్న ముఖ్యమంత్రి... ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, అలసిపోయిన వారికి వసతి కల్పించడం ద్వారా దేవదేవుడికి సేవ చేసినట్లేనని అన్నారు.

ఇందులో భాగంగా రూ.160 కోట్లతో నిర్మించనున్న అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన సమీకృత రవాణా టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

### రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు

తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనుల్లో తుడా రూ.127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ.115 కోట్లతో 3.60 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. ఈ రహదారులు జాతీయ రహదారులు 140, 71 మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నాయి.

శ్రీవారి సేవలో నిరంతరం నిమగ్నమయ్యే టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో 418 ఎకరాల్లో నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మొదటి, రెండో దశల్లో కలిపి మొత్తం 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు.

ఇందులో టీటీడీ వాటాగా రూ.150 కోట్లు, ఉద్యోగుల వాటా రూ.80 కోట్లు వ్యయం చేయనున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ టౌన్ షిప్ ను పర్యావరణ హితంగా నెట్‌జీరో గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం ఉంటే వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందించగలరని సీఎం అన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సేవాభావంతో పనిచేస్తున్న టీటీడీ సిబ్బందిని అభినందించారు.

### ఆధ్యాత్మిక అనుభూతి... ఆధునిక సాంకేతికత

తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భక్తులకు పరిచయం చేసేందుకు పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్ద?శం చేశారు. డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తిరుపతి నుంచి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ సంతృప్తికరమైన అనుభూతిని పొందేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

భక్తులకు సమాచారం తెలిపేందుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. తిరుమల తరహా పవిత్రత దిగువన తిరుపతిలోనూ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా, ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతిలోని చెరువులన్నింటినీ అనుసంధానించి సుందరంగా తీర్చిదిద్దాలని, కల్యాణి డ్యామ్ వరకు ఉన్న ప్రాంతాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఔషధ మొక్కల ప్రాంతాన్ని సందర్శకులకు ఆధ్యాత్మిక, ప్రకృతి అనుభూతిని అందించే ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నారు. వృక్షో గోవింద కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, గోశాలల నిర్వహణ, గోసేవను ప్రోత్సహించాలని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వివాహాలు, సదస్సులు, క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి

అన్నదానం, ప్రాణదానం, విద్యా దానం వంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీవారి సేవకుల తరహాలో ఇతర దేవాలయాల్లోనూ సేవా వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజలను సన్మార్గంలో నడిపించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా యువతలో ఒత్తిడిని తగ్గించి, ఆధ్యాత్మికత వైపు నడిపించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఆధ్యాత్మికతను సాంకేతికతతో కలిపి ముందుకు తీసుకెళ్లాలని, శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింతగా చాటిచెప్పే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పవిత్రత విషయంలో ఎక్కడా రాజీపడబోమని సీఎం స్పష్టం చేశారు. మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలతో తిరుపతి త్వరలోనే వివాహ వేడుకలకు ప్రముఖ గమ్యస్థానంగా మారే అవకాశముందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తే నగరంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని చెప్పారు. క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు, ఏసీఏ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించాలని, ఉపాధి అవకాశాలు పెంచేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### సమష్టి కృషితో ఆదర్శ నగరంగా తిరుపతి

దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు, యాత్రీకులు తిరుపతిని చూసి రాష్ట్రం గురించి అంచనా వేస్తారని, అందుకే ఈ నగరాన్ని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.

పురపాలక శాఖ పట్టణాల అభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా పనిచేయాలని సూచించారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సంక్షేమం, తిరుపతి నగర మౌలిక సదుపాయాల విస్తరణ ఈ లక్ష్యాలను సమన్వయం చేస్తూ తిరుపతిని దివ్యక్షేత్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

## పులివెందుల: ఒక హత్య...

# ఆరు మరణాలు... తేలని క్లైమాక్స్

మొదటి పేజీ తరువాయి..

అదే సమయంలో ఏదీ ఎదుట ఎల్లుండి ఎంపీ అవినాష్ రెడ్డి విచారణ అంశం కూడా తెరపైకి రావడంతో రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

### 'గుండ్లవాగు శంకర్': ఒక పజిల్

దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి (గుండ్లవాగు శంకర్) వైసీపీ రాష్ట్ర కార్యదర్శి. పులివెందుల, కడప రాజకీయాల్లో వైఎస్ కుటుంబానికి వ్యతిరేకంగా నిలబడే శక్తులకు సింహస్వప్నం. తానే స్వయంగా అనామక పార్టీల బీ-ఫారమ్‌లపై లేదా ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతాడు. వైఎస్ ప్రత్యర్థులను ప్రత్యక్షంగా పోలింగ్ రోజు బూతుల్లో బెదిరిస్తాడు. వైఎస్ కుటుంబం కోసం ఎన్నికల బూతుల్లో చక్రం తిప్పడం ఇతని శైలి. దశాబ్దాల పులివెందుల, కడప ఎంపీ సీట్లలో మెజారిటీలకు కారణం మన మిస్టరీ శంకర్. ఆయన స్వయంగా నామినేషన్ వేసి బరిలో నిలబడడం దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒక సాంప్రదాయం. గత ఎన్నికల్లో కూడా అందుకోసం కోర్టును అనుమతి అడిగాడు.

ఇక్కడే కథలో ట్విస్ట్. ఆయన కుమారుడి వివాహానికి వైఎస్ జగన్ హాజరయ్యారు. నంద్యాలలో ఎన్నికల ప్రచారాన్ని మధ్యలో ఆపి మరీ వచ్చారు. పులివెందుల వీధుల్లో బుల్లెట్ బైక్ వెనుక శంకర్‌ను కూర్చోబెట్టుకుని తిప్పే సాన్నిహిత్యం వైఎస్ అవినాశ్ రెడ్డి.

### వివేకా తరువాత అరడజను (అ)సహజ మరణాలు!

ఈ కేసును మరింత భయానకంగా మార్చింది ఒక అంశం: కేసుతో ముడిపడిన ఆరుగురు వ్యక్తుల మరణాలు.

1. నారాయణ యాదవ్- 2019 డిసెంబర్‌లో కన్నుమూశారు. అంత్యక్రియల దారిలో ఫోన్ సంభాషణలు విన్నారని చెబుతారు.

2. బి. రంగన్న - హత్యను చూసిన ఏకైక సాక్షిగా చెప్పే వాచ్‌మన్. మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన కొద్ది రోజులకే ఆసుపత్రిలో మరణించారు.

3. కల్లూరి గంగాధర్ రెడ్డి - "హత్యను నాపై వేసుకుంటే రూ.10 కోట్లు ఇస్తామన్నారు" అని సీబీఐకి చెప్పినట్లు కథనం. 2022 జూన్‌లో మృతి చెందారు.

4. కటికరెడ్డి శ్రీనివాసులురెడ్డి - 2019 సెప్టెంబరులో మరణించారు. ఆయన పేరుతో ఉన్న లేఖలపై వివాదం ఉంది.

5. డా. వైఎస్ అభిషేక్ రెడ్డి - వాంగ్మూలం ఇచ్చిన యువ వైద్యుడు. జనవరిలో అనారోగ్యంతో హఠాన్మరణం.

6. ఈసీ గంగిరెడ్డి- 2020 అక్టోబరులో మరణించారు. వివేకా ఇంటి నుండి తలకొట్టుకుంటూ ఏడుస్తూ బయటకు వచ్చిన సున్నిత మనసున్న డాక్టర్.

మరణించిన ప్రతి ఒక్కరూ కేసుతో సంబంధం ఉన్న వారే అనే విషయం మనకు తెలిసిందే. కానీ వీటి వెనుక కుట్రలు ఏవైనా ఉన్నాయా అని విచారిస్తే అది మరో ఆరు వెబ్ సిరీస్లు అవుతాయి.

### క్లైమాక్స్ ఎక్కడ?

డాక్టర్ సునీత రాష్ట్రపతికి వ్రాసిన లేఖ తరువాత ఈడీ దర్యాప్తు వేడెక్కుతోంది. మరోవైపు సాక్షుల మౌనం, మరణాల నీడ. బతికున్న సునీల్ యాదవ్ నుండి దస్తగిరి వరకు మా ప్రాణాలకు రక్షణ కావాలి అని దీనంగా వేడుకుంటున్నారు. సూత్రధారులు ఎవరో, ఎవరి చేతులు ఏ తెర వెనుక ఉన్నాయో న్యాయస్థానమే తేల్చాలి. సాక్షిలో గుండెపోటు స్క్రోలింగుకు ముందే తెల్లవారుఝామున లోటస్ పాండ్ కు ఆ గొడ్డలి పోట్ల గురించి తెలిసీ ఎందుకు డ్రామా ఆడారు?

అదే లోటస్ పాండ్‌కు హత్య జరిగిన ముందురోజు ఉదయం వైఎస్ వివేకానందరెడ్డి రావడం, లోపల గొడవ జరగడం, ఆయన ఏడ్చుకుంటూ రావడం జరిగింది. ఎప్పుడూ కూతురికి చెప్పి మాత్రలు తీసుకొని వెళ్లే ఆయన, లోటస్ పాండ్ ముందర టికెట్ల కోసం ధర్నా చేస్తున్న వారిని కూడా పలకరించి, అటు నుండి అటే మృత్యువు తరుముకు వస్తున్నట్లుగా.. ఎన్నికల ప్రచారం కోసం కడపకు వెళ్లిపోవడం తదితర రహస్యాల మీద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోరు తెరిస్తే చిటికెలో తేలిపోయే మర్డర్ కేసు ఇది. అటు నుండి కాకుండా ఆరు సహజ మరణాలు జరిగినా అంతులేని కథ లెక్కన సాగుతోంది.

ఏది ఏమైనా తెలుగు రాష్ట్రాలు ఆ చివరి సీన్ కోసం ఊపిరి బిగబట్టి ఎదురు చూస్తున్నాయి.

ఇంకా ఉంది... కథ ఇంకా ముగియలేదు.

# 106 పురపాలక సంఘాల చైర్మన్ రిజర్వేషన్లు ఖరారు

మొదటి పేజీ తరువాయి..

**ఎస్టీ - 3 స్థానాలు**

మహిళ (1): గూడూరు.

జనరల్ (2): ఆలూరు, ఆత్మకూరు.

**ఎస్సీ - 14 స్థానాలు**

మహిళలు (7): చింతలపూడి, సూళ్లూరుపేట, కొండపల్లి, నిడదవోలు, ఏలేశ్వరం, గుత్తి, చీరాల.

జనరల్ (7): ఉయ్యూరు, సామర్లకోట, పిఠాపురం, నూజివీడు, కుప్పం, పొదిలి, బాపట్ల.

**బీసీ - 36 స్థానాలు**

మహిళలు (18): చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, గుంతకల్లు, గుడివాడ, నందిగామ, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

జనరల్ (18): కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేలు.

**జనరల్ మహిళలు - 27 స్థానాలు**

కనిగిరి, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాళెం, ఎర్రగుంట్ల, యలమంచిలి, కల్యాణదుర్గం, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

**అన్‌రిజర్వ్‌డ్ - 26 స్థానాలు**

సాలూరు, తణుకు, తెనాలి, తాడేపల్లిగూడెం, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, రామచంద్రాపురం, సత్తెనపల్లి, శ్రీకాళహస్తి, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గం, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిగడప, పిడుగురాళ్ల, తాడిపత్రి, పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి.

## మేయర్లుగా మహిళలకు, బీసీలకు పెద్దపీట!

మొదటి పేజీ తరువాయి..

ఏ కార్పొరేషన్ ఏ కేటగిరికి కేటాయించబడింది? (షెడ్యూలు 2) :

మంగళగిరి తాడేపల్లి: ఎస్టీ (జనరల్)
కర్నూలు: ఎస్సీ (మహిళ)
రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్)
కాకినాడ: బీసీ (మహిళ)
మచిలీపట్నం: బీసీ (మహిళ)
ఏలూరు: బీసీ (జనరల్)
అనంతపురం: బీసీ (జనరల్)
చిత్తూరు: బీసీ (జనరల్)
విజయనగరం: మహిళ (జనరల్)
శ్రీకాకుళం: మహిళ (జనరల్)
గుంటూరు: మహిళ (జనరల్)
కడప: మహిళ (జనరల్)
జీవీఎంసీ (+ఎవీజ): మహిళ (జనరల్)
తిరుపతి: అన్‌రిజర్వ్‌డ్
విజయవాడ: అన్‌రిజర్వ్‌డ్
ఒంగోలు: అన్‌రిజర్వ్‌డ్
నెల్లూరు: అన్‌రిజర్వ్‌డ్

ఈ ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ మరియు డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
# మహానాడు ®
Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026




# ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

### ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**
ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్ధవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పట్టణాలకు ధీటుగా గ్రామాల అభివృద్ధి

- ఆగిరిపల్లిలో రూ.కోటితో పనులకు శ్రీకారం
- అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**ఏలూరు, మహానాడు:** పట్టణాలకు ధీటుగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లి మండలంలో సోమవారం రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి, శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. కృష్ణవరం గ్రామంలో రూ.80 లక్షలతో కమ్యూనిటీ హాలు, రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు, ఆగిరిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో ముదిరాజుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు మంత్రికి పూలజల్లులు కురిపిస్తూ, బాణసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి, నుదుటన కుంకుమ తిలకం దిద్దారు. గ్రామాల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామాల్లో మిగిలి ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి పారుదల సమస్యలను అధిగమించేందుకు డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య



వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, గంగిరెద్దుల సంఘం నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని డ్వాక్రా మహిళలు కలిశారు. సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ నేతృత్వంలో డ్వాక్రా మహిళలు సీఎంను క్యాంప్ కార్యాలయంలో కలిసి 13వ తేదీ నుంచి జరిగే సరస్ మేళాకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాము తయారు చేసిన ఉత్పత్తులను సీఎంకు చూపించారు.

# ఏడాది పాటు శాంతికి భంగం కలిగించవద్దు

- షరతుపై సిపిజే నేతల విడుదల

### మహిళా ఫోటోల మార్ఫింగ్ కేసులో సిజెపి నేతలకు తాజా నోటీసులు

**ఢిల్లీ:** 'కాక్‌రోచ్ జనతా పార్టీ' రాజకీయ బృందానికి చెందిన అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ ర్యాంకాలను స్థానిక కోర్టు విడుదల చేసింది. ఢిల్లీలో విమానం దిగిన తర్వాత శనివారం నాడు వీరిని అదుపులోకి తీసుకుని, ఆపై ముందస్తు చర్యగా అరెస్టు చేశారు. ఒక సంవత్సరం పాటు "శాంతికి భంగం కలిగించే" పనులు ఏవీ చేయకూడదనే షరతుపై వారిని విడుదల చేశారు. ఈ ముగ్గురు సిజెపి నాయకులను ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

"అభిజీత్ దిప్కే, అశుతోష్ ర్యాంకా, సౌరవ్ దస్‌లను బిఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్లు 126/170 కింద నివారణ చర్యగా 10.10.2026న అరెస్టు చేయడం జరిగింది. చట్టపరమైన అన్ని విధానాలను అనుసరించి, వారిని 11.10.2026న ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఎస్ఈఎం కోర్టులో హాజరుపరిచాము," అని ఢిల్లీ పోలీసులు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "శాంతిని, సత్ప్రవర్తనను ఒక సంవత్సరం పాటు పాటించేలా చూసేందుకు రూ. 50,000 విలువైన పూచీకత్తు సమర్పించారు. తద్వారా వారిని



FORM NO. 13
BOND TO KEEP THE PEACE
(Sections 125 and 126, BNSS, 2023)

WHEREAS I, Abhijeet Dipke, inhabitant of New Delhi, Delhi (place), have been called upon to enter into a bond to keep the peace for the term of 1 (one) year or until the completion of the inquiry in the matter now pending before the Court of Executive Magistrate, New Delhi District

I hereby bind myself not to commit a breach of the peace, or do any act that may probably occasion a breach of the peace, during the said term or until the completion of the said inquiry and, in case of my making default therein, I hereby bind myself to forfeit to Government the sum of rupees 50,000/- (Rupees Fifty Thousand only)

Amount in words: Rupees Fifty Thousand only

Date: 10.10.2026

Place: New Delhi

Abhijeet Dipke
Signature of person executing bond

EXECUTIVE MAGISTRATE NEW DELHI DISTRICT
10.10.2026
Seal and signature of Executive Magistrate New Delhi District



ఎస్ఈఎం కోర్టు విడుదల చేసింది," అని పోలీసులు పేర్కొన్నారు.

ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు, ఒక మహిళకు సంబంధించిన పాత కేసులో సిజెపి నాయకులకు ఢిల్లీ పోలీసులు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఒక మహిళ ఫోటోలను మార్ఫింగ్ చేసి అభ్యంతరకరమైన చిత్రాలను సృష్టించి, వాటిని ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారన్న ఆరోపణలకు సంబంధించినది ఈ కేసు. ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా హైకోర్టు గతంలోనే సిజెపి నాయకులకు నోటీసులు జారీ చేసి, వారికి ఆ నోటీసులను అందజేయాలని పోలీసులను ఆదేశించింది.

సోషల్ మీడియాలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఉన్నట్లుగా సదరు మహిళ ఫోటోను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేసిన కంటెంట్‌ను వెంటనే తొలగించాలని కూడా కోర్టు 'మెటా' ప్లాట్‌ఫారమ్‌లను ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ పక్కన తాను ఉన్నట్లుగా చూపించే ఏఐ-సృష్టిత చిత్రాలు ఆన్‌లైన్‌లో ప్రచారం కావడం మొదలైందని కోర్టును ఆశ్రయించిన ఆ మహిళ పేర్కొన్నారు.

ఆ ఏఐ-సృష్టిత ఫోటోలన్నింటినీ తొలగించాలని, వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల, అన్ని వెబ్‌సైట్ల నుండి వాటిని పూర్తిగా తొలగించాలని ఆమె కోర్టును కోరుతున్నారు. ఈ చర్యకు బాధ్యులుగా సిజెపి కార్యకర్తలు సౌరవ్ దాస్, అభిజిత్ దిప్కే, అశుతోష్ రంకా, రత్న సింగ్ పేర్లను ఆమె ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల కింద ఢిల్లీ పోలీసులు ఇప్పటికే న్యూఢిల్లీలోని సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# ఏపీలో 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో 11 మంది ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగ్‌లు కల్పించింది. వీరిలో తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు ఇవ్వగా, మరో ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఏపీ భవన్ ఓఎస్డీగా సౌరభ్ గౌర్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిగా మురళీధర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి నియమితులయ్యారు. యువజన సేవల సంచాలకుడిగా నీలకంఠ రెడ్డికి, సామాజిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శిగా తేజ్ భరత్‌కు బాధ్యతలు అప్పగించారు. పౌర సరఫరాల సంస్థ ఎండీగా వరప్రసాద్‌ను నియమించారు.






తిరుపతి అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు . కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, బోర్డు మెంబర్లు, అధికారులు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి

### పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పనిచేయాలి
### ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
### మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం

**కోటబొమ్మాళి, మహానాడు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. అభ్యర్థి ఎవరనే దానితో సంబంధం లేకుండా పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని స్పష్టం చేశారు. అక్టోబర్ 12న కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. కూటమి ప్రభుత్వం గత 28 నెలలుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను వివరించాలని తెలిపారు.

ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. స్థానిక సంస్థల



ఎన్నికల్లో సమన్వయమే కీలకమని పేర్కొంటూ, కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు పరస్పర సహకారంతో పనిచేయాలని అన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలకు తావులేకుండా పార్టీ శ్రేణులన్నీ ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

గ్రామస్థాయిలో పార్టీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల మద్దతు పొందేలా కార్యాచరణ రూపొందించుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు. నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరిస్తూ ఎన్నికలకు సమాయత్తం కావాలని, ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టి కృషితో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో అనుబంధ విభాగాలదే కీలక పాత్ర

### ప్రజా సమస్యలపై విస్తృత ప్రచారం..
### ఆధారాలతో అక్రమాలను ఎండగట్టాలి
### రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి

**తాడేపల్లి, మహానాడు:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలు పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించి, గ్రామస్థాయి వరకు పార్టీ శక్తిని సమన్వయంతో వినియోగించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి విభాగం తన పరిధిలోని సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఎన్నికల ప్రక్రియలో పార్టీ అభ్యర్థులకు అండగా నిలవాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు, జోనల్ కార్యనిర్వాహక అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన అంశంగా సమావేశం జరిగింది.

ప్రతి అనుబంధ విభాగం పార్టీకి కీలకమైన భాగమని, అన్ని విభాగాలు సమర్థంగా పనిచేసినప్పుడే పార్టీ లక్ష్యాలను సాధించగలదని సజ్జల అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశమని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన, ఎన్నికల ప్రక్రియపై ఆయన విమర్శలు చేశారు. రిజర్వేషన్ల నుంచి నామినేషన్ల వరకు సరైన సమాచారం, తగిన సమయం ఇవ్వకుండా ప్రతిపక్షాన్ని ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాల జారీలో ఆలస్యం చేయడం, నామినేషన్లకు అడ్డంకులు సృష్టించడం, అభ్యర్థులను పోలీస్ స్టేషన్లకు పిలిపించడం, బైండోవర్ కేసులతో ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి స్థానానికి ఒక అభ్యర్థితో సరిపెట్టకుండా, రెండు మూడు ప్రత్యామ్నాయాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నామినేషన్ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు, బ్యాలెట్ పెట్టెల భద్రత వరకు ప్రతి దశలో పార్టీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే కార్యకర్తలు, నాయకుల పనితీరును ఈసారి వ్యవస్థీకృతంగా నమోదు చేయాలని సజ్జల చెప్పారు. కార్యక్రమాలు, సమావేశాలు, విలేకరుల సమావేశాలు, డిజిటల్ కార్యకలాపాలు, క్షేత్రస్థాయి పనితీరు తదితర అంశాలను నమోదు చేసి పర్యవేక్షించే విధానాన్ని తీసుకురావాలని పార్టీ నిర్ణయించిందన్నారు. కేవలం పదవిలో ఉన్నారనే కారణంతో కాకుండా, వాస్తవంగా పార్టీకి విలువ జోడించి పనిచేసినవారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు, గౌరవం లభించేలా చూడాలని పేర్కొన్నారు. అనుబంధ విభాగాల నాయకులు తమ పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ, మండల స్థాయి పదవులను గుర్తించి భర్తీ చేయడంతోపాటు ఎన్నికల సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.




పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి గ్రామస్థాయి వరకు పార్టీకి బలమైన అనుబంధ విభాగాల వ్యవస్థ ఉందన్నారు. దాదాపు 14 లక్షల మంది పార్టీ సంస్థాగత వ్యవస్థలో ఉండగా, అందులో పెద్ద సంఖ్యలో అనుబంధ విభాగాల నాయకత్వం ఉందని తెలిపారు. ఈ వ్యవస్థను గ్రామస్థాయి వరకు క్రియాశీలం చేసి, ప్రచారం, సామాజిక మాధ్యమాలు, బూత్ నిర్వహణ, అభ్యర్థుల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో వినియోగించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లలో మహిళా, యువజన, విద్యార్థి, రైతు, బీసీ, ఎస్సీ తదితర అనుబంధ విభాగాలు ప్రజా సమస్యలపై అనేక కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించాయని అభినందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రచారం నుంచి అభ్యర్థులకు అండగా నిలవడం, పోలింగ్ రోజున బూత్ ఏజెంట్లుగా పనిచేయడం, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో అనుబంధ విభాగాలు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయలేదని, ధరల పెరుగుదలతోపాటు మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ప్రభావం విస్తృతంగా ఉన్నందున, ఒక నిమిషం నిడివి గల చిన్న వీడియోలు, రీల్స్ ద్వారా ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు పరిస్థితి, గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం రోజు సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ వేడుకల్లో శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు , శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి , శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు

Mahanaadu Media



డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026

# 12వ పీఆర్సీని త్వరగా పూర్తి చేయాలి

**ఉద్యోగులకు మెరుగైన ఫిట్‌మెంట్ ఇవ్వాలి**

**పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్‌కు సచివాలయ సంఘం విజ్ఞప్తి**



**అమరావతి, మహానాడు:**

12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా సిఫారసులు చేయాలని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం కోరింది. ఈ మేరకు 12వ పీఆర్సీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గత ప్రభుత్వ హయాంలో 11వ పీఆర్సీ ద్వారా ప్రకటించిన ఫిట్‌మెంట్ కారణంగా, అంతకుముందు ప్రకటించిన మధ్యంతర భృతి (ఐఆర్) కంటే ఉద్యోగులకు తక్కువ ప్రయోజనం లభించిందని సంఘం ప్రతినిధులు వివరించారు. దీంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని 12వ పీఆర్సీలో సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫిట్‌మెంట్‌కు అనుగుణంగా వివిధ అలవెన్సులు, రుణాలు, అడ్వాన్సులు, ప్రోత్సాహకాలను సవరించాల్సి ఉన్నప్పటికీ, గతంలో వాటిని తగిన విధంగా సమీక్షించకపోవడంతో ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని తెలిపారు. ఈసారి ఫిట్‌మెంట్‌తో పాటు అలవెన్సులు, రుణాలు, అడ్వాన్సులు, ప్రోత్సాహకాలను కూడా సమీక్షించి, ఉద్యోగులకు గరిష్ఠ ప్రయోజనం కల్పించేలా సిఫారసులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

12వ పీఆర్సీ ప్రక్రియలో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో నివేదిక రూపొందించాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల ఆర్థిక పరిస్థితులు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహేతుకమైన ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. వేతన సవరణతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాల విషయంలోనూ సమగ్ర దృష్టితో వ్యవహరించాలని కమిషనర్‌కు సూచించారు.

సచివాలయ సంఘం ప్రతినిధులు వివరించిన అంశాలను పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్ శ్రద్ధగా ఆలకించి సానుకూలంగా స్పందించినట్లు సంఘం తెలిపింది. పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్యోగ సంఘాలు సమర్పించే ప్రతిపాదనలను పరిశీలించి, తగిన విధంగా పరిగణనలోకి తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయబద్ధమైన వేతన సవరణ, మెరుగైన ఆర్థిక ప్రయోజనాలు అందేలా తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, కార్యవర్గ ప్రతినిధులు వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామంటూ రైతుల నిరసన

**- అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి చెప్పులతో కొట్టుకుంటూ ఆవేదన**



**ఆదిలాబాద్, మహానాడు:** కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని ఆదిలాబాద్ జిల్లా ముఖరా కే గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రబీ పంటలు వేయొద్దని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయలేమని ప్రభుత్వం చెప్పడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నిరసనను తెలియజేస్తూ అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి, చెప్పులతో కొట్టుకున్నారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు పుష్కలంగా సాగునీరు అందేదని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం కరెంటు ఇవ్వలేమని, రబీ పంటలు వేయొద్దని చెబితే తాము వ్యవసాయం ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. పంటలు పండించుకునేందుకు అవసరమైన విద్యుత్, సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఏపీ పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు

**స్పెయిన్‌లో మంత్రి కందుల దుర్గేష్**

**మూడు రోజుల పర్యటన విజయవంతం**



**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేపట్టిన మూడు రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు.

స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్–2026'లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం, ప్రదర్శన అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, సుస్థిర పర్యాటక విధానాలపై నిపుణులతో విస్తృతంగా చర్చించారు.

కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన 'నివ ఏఐ' సాంకేతికతను మంత్రి అంతర్జాతీయ వేదికపై ఆవిష్కరించారు. 'ఎక్స్‌ప్లర్జర్' సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని 100కుపైగా ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు వారి సొంత భాషలోనే సమాచారం అందించేలా ఈ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. దీనివల్ల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు సందర్శన మరింత సులభతరం కానుంది.

స్పెయిన్‌కు చెందిన పలువురు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక సంస్థల ప్రతినిధులతో మంత్రి నేరుగా సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలను వివరిస్తూ వెల్‌నెస్ కేంద్రాలు, ఆలయ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, రిసార్టుల ఏర్పాటుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించారు.

సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. "మీరు ఇప్పటికే భారతదేశాన్ని చూశామని భావిస్తే.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి చూడండి. మేము మిమ్మల్ని కచ్చితంగా ఆశ్చర్యపరుస్తాం" అని పిలుపునిచ్చారు. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్పెయిన్ పర్యటన ద్వారా లభించిన అనుభవాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు చేపడతామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యటన సందర్భంగా తనకు లభించిన ఆతిథ్యం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

**14, 15 తేదీల్లో విజయవాడకు ద్రౌపది ముర్ము**

**కనకదుర్గమ్మ దర్శనం.. పున్నమి ఘాట్‌లో సరస్ మేళాకు హాజరు**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్**



**అమరావతి, మహానాడు:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో పర్యటించనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి సోమవారం వివిధ శాఖల అధికారులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పర్యటనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి సచివాలయం జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన నిమిషాలవారీ కార్యక్రమం నిర్ణీత సమయానికి అనుగుణంగా, ఎలాంటి ఆలస్యం లేకుండా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అంతకుముందు సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి వివిధ శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3.55 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 6.25 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి వెళ్లి, రాత్రి 7.20 నుంచి 7.40 గంటల వరకు కనకదుర్గమ్మను దర్శించుకుంటారు. అనంతరం విజయవాడలో రాత్రి బస చేస్తారు.

ఈ నెల 15వ తేదీ ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి పున్నమి ఘాట్‌కు చేరుకుంటారు. అక్కడ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు స్వయం సహాయక సంఘాల సభ్యులు, 'లఖ్‌పతి దీదీ'లతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

ఈ సమావేశంలో అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కరుణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు కె.ఎస్. విశ్వనాథన్, దుర్గగుడి ఈవో శీనా నాయక్, ప్రొటోకాల్ విభాగం అధికారి ఎస్. రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక అభ్యర్థులకు సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలి

**జాప్యంతో పోటీ చేసే అవకాశం కోల్పోకూడదు**

**సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**

**పెండింగ్ దరఖాస్తులను అత్యవసరంగా పరిష్కరించాలి**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ**



**తాడేపల్లి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన కుల, కమ్యూనిటీ, నో డ్యూస్ (బకాయిలు లేవని తెలిపే ధ్రువీకరణ), నిరభ్యంతర పత్రాలను (ఎన్‌వోసీ) తక్షణమే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు. సర్టిఫికెట్ల జారీలో జాప్యం కారణంగా ఏ ఒక్క అర్హుడైన దరఖాస్తుదారుడూ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమస్యపై గతంలో అక్టోబరు 1, 5 తేదీల్లో రెండు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పరిష్కారం కాలేదని పేర్కొంటూ సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మరోసారి లేఖ రాశారు. అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా, సకాలంలో వాటిని పొందలేకపోతున్నట్లు తమకు సమాచారం అందుతోందని లేఖలో తెలిపారు.

త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నందున, సర్టిఫికెట్ల జారీపై నెలకొన్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని లేళ్ల అప్పిరెడ్డి కోరారు. నామినేషన్ల దాఖలుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందకపోతే అర్హులైన అభ్యర్థులు నామినేషన్లు వేయలేక ఎన్నికల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

అందువల్ల అర్హులైన దరఖాస్తుదారులకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సర్టిఫికెట్లు అందేలా అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఇతర సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అత్యవసరంగా పరిష్కరించాలని, కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా ఎలాంటి వివక్షకు తావులేకుండా సత్వరమే పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. సాంకేతిక సమస్యల వల్ల సేవలకు అంతరాయం ఏర్పడితే, సర్టిఫికెట్ల జారీ నిరంతరంగా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.







# భూ ఆక్రమణలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

**- వైసీపీ హయాంలో భూ రికార్డులు మార్చి ఆక్రమించారని బాధితుల ఫిర్యాదులు**

**- భూరక్ష సర్వేతో భూములు కోల్పోయామంటూ పలువురి ఆవేదన**

**- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు**

**మంగళగిరి, మహానాడు:**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో భూ ఆక్రమణలు, రికార్డుల మార్పులు, దౌర్జన్యాలు, ఇతర సమస్యలపై పలువురు బాధితులు ఫిర్యాదులు చేశారు. శాసనసభ్యుడు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన రేవిడి కృష్ణ మాట్లాడుతూ.. ఆలమూరు మండలం లంకధర్మవరంలో తమ తాత మైలపల్లి అప్పన్నకు ప్రభుత్వం ఇనాం పట్టాగా ఇచ్చిన 3.55 ఎకరాల భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీహరి అనే వ్యక్తి పేరుతో మార్చారని, విచారణ జరిపి భూమిని తిరిగి ఇప్పించాలని కోరారు.

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన ఆలకుంట కడియ్య మాట్లాడుతూ.. తమకు చెందిన 3.50 ఎకరాల భూమి రికార్డులను జగనన్న భూరక్ష సర్వేలో మార్చేశారని, ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులు, 1బీ, అడంగల్‌లో తమ పేర్లు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఆవులవారిపాలెంకు చెందిన వల్లాల దుర్గారావు తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం పానగల్‌కు చెందిన పి.రామకృష్ణయ్య శ్రీ కూర్మనాథ గోపాలస్వామి దేవస్థాన భూములపై జరిగిన అక్రమ ఆన్‌లైన్ నమోదులను రద్దు చేసి దేవస్థాన ఆస్తులను కాపాడాలని కోరారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లికి చెందిన బి.శంకరయ్య శెట్టి తన భూమిని బంధువు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, విచారణ జరిపి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన తిరుమలమ్మ తమ ఇంటికి వెళ్లే దారిని కొందరు అడ్డుకుంటున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. అదే మండలం మిట్టూరుకు చెందిన జి.శ్యామమూర్తి తన పట్టా భూమిలో ఇతరులు అక్రమంగా సాగు చేస్తున్నారని, రికార్డుల ప్రకారం భూమిని తిరిగి ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన బి.మల్లప్ప నాయుడు తనకు పట్టా ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకోకుండా అడ్డుకుంటున్నారని, న్యాయం చేయాలని కోరారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సలహాల రాజు తన కుటుంబంపై దాడి చేసి కేసులు పెట్టించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం నుచ్చుమిల్లికి చెందిన జి.జోగిరాజు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణాలు, ఉద్యోగాలు, అనారోగ్య సమస్యలకు ఆర్థిక సాయం కోరుతూ అర్జీలు సమర్పించారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా 'సమావేశి ఆజీవిక యోజన'

**- 10 వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం**

**- రాష్ట్రంలో అత్యంత పేదరికానికి చరమగీతం పాడటమే లక్ష్యం**

**- 26 మండలాల్లోని 650 గ్రామ సంఘాల ద్వారా లబ్ధిదారుల ఎంపిక**

**- ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం.. బ్యాంకు రుణాలు, ఆస్తుల ఏర్పాటుకు సహకారం**

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలోని అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సమావేశి ఆజీవిక యోజన' (ఎస్ఏవై) అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీనదయాళ్ అంత్యోదయ యోజన--జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (డీఏవై--ఎన్ఆర్ఎల్ఎం) కింద ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తీవ్ర పేదరికం కారణంగా స్వయం సహాయక సంఘాల పరిధిలోకి రాలేక, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేని కుటుంబాలను గుర్తించి, వారిని పేదరికం నుంచి బయటపడేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

యానాది, చెంచు తెగల జనాభా అధికంగా ఉన్న 26 మండలాల్లోని 650 గ్రామ సంఘాల ద్వారా 10 వేల అత్యంత నిరుపేద కుటుంబాలను ఎంపిక చేయనున్నారు. భాగస్వామ్య గ్రామీణ మదింపు (పీఆర్ఏ), గృహ సర్వేల ఆధారంగా అర్హులైన కుటుంబాలను గుర్తిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సాయం' (ఎస్ఏవైఏఎం) అనువర్తనం ద్వారా దుర్బలత్వ సూచీ ఆధారంగా కుటుంబాలకు ప్రాధాన్య ర్యాంకులు కేటాయిస్తారని మంత్రి తెలిపారు.

మండల సమాఖ్యలు ఎంపిక చేసే 100 మంది ఉపాధి సఖులు ఒక్కొక్కరు 100 కుటుంబాలకు మార్గదర్శకత్వం వహించి, అవసరమైన సహకారం అందిస్తారు. ప్రతి కుటుంబానికి ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికను రూపొందిస్తారు. ఇందులో ప్రకృతి వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడం, జీవనోపాధికి అవసరమైన ఆస్తుల ఏర్పాటు వరకు ఉపాధి సఖులు తోడ్పడతారు. ఈ కార్యక్రమానికి 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్' (క్రిస్ప్) సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ నెల 21న సెర్ప్ కార్యాలయంలో 26 మండల సమాఖ్యల అధ్యక్షులతో సమావేశం నిర్వహించడంతోపాటు, సాయం అనువర్తనంపై శిక్షణ ఇవ్వనున్నారు. అక్టోబరు 25 నుంచి 30 వరకు గ్రామ సంఘాల ఆధ్వర్యంలో భాగస్వామ్య గ్రామీణ మదింపు నిర్వహించి, ఉపాధి సఖులకు శిక్షణ ఇస్తారు. నవంబరు 1 నుంచి 15 వరకు గృహ సర్వేలు నిర్వహిస్తారు. నవంబరు 16న అత్యంత నిరుపేద కుటుంబాల తుది జాబితాను ప్రకటించనున్నారు.

డిసెంబరులో కుటుంబాల వారీగా అనువైన జీవనోపాధులను గుర్తిస్తారు. వచ్చే జనవరి నుంచి బ్యాంకులతో అనుసంధానం, జీవనోపాధి ఆస్తుల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనున్నారు.

లో ఉన్న కుటుంబానికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరుపేద కుటుంబాలు వెనుకబడిపోకుండా, స్వయం సహాయక సంఘాల మహిళల సామర్థ్యాన్ని వినియోగించుకుని ఈ పథకాన్ని విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యంత పేదరికాన్ని నిర్మూలించి, నిరుపేద కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

# దసరాకు 5,261 ప్రత్యేక బస్సులు.. సాధారణ ఛార్జీలే!

**ఈ-బస్సులు, సీఎన్‌జీ బస్సులతో ఆర్టీసీ సేవల విస్తరణ**

**తిరుమల బ్రహ్మోత్సవాలకు 425 ఘాట్ బస్సులు సిద్ధం**




**విజయవాడ, మహానాడు:**

దసరా పండుగ, నవరాత్రి బ్రహ్మోత్సవాలు, వరుస పండుగల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉందని సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ తెలిపారు. దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 5,261 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని, ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పండుగ ప్రత్యేక సర్వీసులు, కొత్త బస్సుల సమీకరణ, ప్రయాణికుల భద్రత, సిబ్బంది సంక్షేమం తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు.

## దసరాకు 5,261 ప్రత్యేక బస్సులు

దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 5,261 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు శివ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి ప్రజలు స్వస్థలాలకు చేరుకునేందుకు ప్రీ–దసరా ప్రత్యేక సర్వీసులు, పండుగ సెలవుల అనంతరం తిరిగి ఉద్యోగ ప్రాంతాలకు వెళ్లేందుకు పోస్ట్–దసరా సర్వీసులు నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్లు, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి ప్రత్యేక బస్సుల సంఖ్యను సమీక్షించి, అవసరమైన చోట మరిన్ని సర్వీసులను పెంచుతామని చెప్పారు. పండుగ సమయంలో ప్రైవేటు బస్సుల ఛార్జీలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతామని స్పష్టం చేశారు.

తిరుమల–తిరుపతి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఘాట్ మార్గంలో నడిపేందుకు మొత్తం 425 బస్సులను సిద్ధం చేశామని, వీటిలో తిరుపతి జిల్లా నుంచి 369, ఇతర జిల్లాల నుంచి 56 బస్సులు ఉన్నాయని వివరించారు. ఈ బస్సుల్లో 100 విద్యుత్ బస్సులు ఉన్నాయని వెల్లడించారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా అదనపు డ్రైవర్లను సమకూర్చడంతోపాటు అవసరమైన శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు.

'స్త్రీ శక్తి' పథకం అమలుతో ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లో ఆక్యుపెన్సీ 100 శాతాన్ని మించుతోందని చెప్పారు. ప్రయాణికులకు సరైన రవాణా సదుపాయం కల్పించేందుకు బస్సుల సంఖ్య పెంచడమే స్థిరమైన పరిష్కారమని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.ఎస్. బ్రహ్మానంద రెడ్డి, రాఘవ కుమార్, జి.వి. రవి వర్మ, ఆర్థిక సలహాదారు, ప్రధాన ఖాతాల అధికారి ఎన్. సుధాకర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ఫార్ములా రైడ్ మేడ్ ఇన్‌భారత్

**త్వరలో మొబైల్ గేమ్ విడుదల**

**ఆటగాళ్ల అభిరుచులకు అనుగుణంగా ..**




**హైదరాబాద్, మహానాడు:** భారతీయ గేమింగ్ రంగంలో మరో కొత్త రేసింగ్ గేమ్ అందుబాటులోకి రానుంది. హైదరాబాద్‌కు చెందిన 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ రూపొందిస్తున్న మొబైల్ రేసింగ్ గేమ్ 'ఫార్ములా రైడ్'ను త్వరలో విడుదల చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వేదికలపై అందుబాటులోకి రానున్న ఈ గేమ్ ప్రస్తుతం గూగుల్ ప్లేలో ముందస్తు నమోదు, యాప్ స్టోర్‌లో ముందస్తు ఆర్డర్‌కు అందుబాటులో ఉంది.

వేగం, వ్యూహాత్మక నిర్ణయాలు, డ్రైవింగ్ నైపుణ్యాలు, కెరీర్ పురోగతిని సమన్వయం చేస్తూ ఈ గేమ్‌ను రూపొందిస్తున్నారు. ట్రాక్‌పై పరిస్థితులకు అనుగుణంగా టైర్ల నిర్వహణ, పిట్‌స్టాప్ వ్యూహాలు, వాహనానికి జరిగిన నష్టాన్ని ఎదుర్కోవడం, బ్రేకింగ్ పనితీరు, రేసు నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తద్వారా కేవలం వేగంగా వాహనాన్ని నడపడమే కాకుండా, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా విజయం సాధించేలా గేమ్‌ప్లేను తీర్చిదిద్దుతున్నారు.

ఆటగాళ్ల అభిరుచులకు అనుగుణంగా ఛాంపియన్‌షిప్, కెరీర్, క్విక్ రేస్, క్లాసిక్ మోడ్‌లను అందించనున్నారు. ఛాంపియన్‌షిప్ మోడ్‌లో 10 జట్లు, 20 మంది డ్రైవర్లతో కూడిన రేసింగ్ సీజన్‌ను ప్రతిపాదించారు. కెరీర్ మోడ్‌లో వివిధ స్థాయులను అధిగమిస్తూ వాహనాలు, వాటి మెరుగుదలలకు సంబంధించిన అవకాశాలను పొందవచ్చు. క్విక్ రేస్, క్లాసిక్ మోడ్‌లతో పాటు రియల్‌టైమ్ మల్టీప్లేయర్ సదుపాయం, లీడర్‌బోర్డులు, విజయాల గుర్తింపు, రోజువారీ బహుమతులు వంటి



ఫీచర్లను కూడా చేర్చనున్నారు.

సులభంగా ఉపయోగించగల నియంత్రణలతో పాటు, నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేలా గేమ్‌ను రూపొందిస్తున్నారు. కొత్తగా ఆడేవారికి సులభంగా అర్థమయ్యే విధంగా ఉండటంతో పాటు, అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు సవాళ్లు ఎదురయ్యేలా పోటీ, పురోగతి వ్యవస్థలను సమన్వయం చేస్తున్నారు.

భారత్‌లో అభివృద్ధి చేసిన గేమ్‌లను అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేయాలన్న లక్ష్యంలో భాగంగా 'ఫార్ములా రైడ్'ను రూపొందిస్తున్నట్లు 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. గేమ్ రూపకల్పన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, దృశ్య రూపకల్పన, నాణ్యత పరీక్షలు, ప్రచురణ వంటి విభాగాల బృందాలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యాయి. వినియోగదారుల ఆదరణ, సాంకేతిక సాధ్యత, వేదికల నిబంధనలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని మెరుగుదలలు, కొత్త కంటెంట్‌ను అందించాలని సంస్థ భావిస్తోంది.

ఎల్.ఎం.శంకర్, 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ, రేసింగ్ ఉత్సాహంతో పాటు వ్యూహాత్మక నిర్ణయాలు, పోటీ, కెరీర్ పురోగతిని కలగలిపిన అనుభవాన్ని ఆటగాళ్లకు అందించడమే లక్ష్యమన్నారు. భారత్‌లో రూపొందించిన సొంత గేమ్‌లను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లకు పరిచయం చేయాలన్న సంస్థ ఆకాంక్షకు 'ఫార్ములా రైడ్' ప్రతిబింబమని పేర్కొన్నారు. వాణిజ్య విడుదల తేదీ, ఇతర వివరాలను సంస్థ అధికారిక మాధ్యమాల ద్వారా వెల్లడించనుంది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ మొబైల్, కంప్యూటర్, వెబ్ వేదికల కోసం డిజిటల్ గేమ్‌లు, ఇంటరాక్టివ్ కంటెంట్‌ను అభివృద్ధి చేసి ప్రచురిస్తోంది. గేమ్ రూపకల్పన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, యానిమేషన్, నాణ్యత నిర్ధారణ, కృత్రిమ మేధ ఆధారిత కంటెంట్ నిర్మాణం వంటి విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## ఓటరు జాబితాలపై కాంగ్రెస్‌ది దుష్ప్రచారం

**ఆధారాలు లేకుండా రాజ్యాంగ సంస్థలపై ఆరోపణలు తగవు**

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ**

**హైదరాబాద్, మహానాడు:** ఓటరు జాబితాల సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీ శర్మ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే నిరసనల పేరుతో ప్రభుత్వ, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, దేశాన్ని ముక్కలు చేస్తామని నినాదాలు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని హితవు పలికారు.

నీట్ పరీక్ష నిర్వహణలో కింది స్థాయిలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పటికీ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని తెలిపారు. విద్యార్థులు మరోసారి ఇబ్బందులు పడకుండా పరీక్ష నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించినప్పటికీ, వాటికి ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిమితులు ఉండాలని స్పష్టం చేశారు.

దేశ పార్లమెంటు 140 కోట్ల ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ప్రతి అంశంపై ధర్నాలు నిర్వహిస్తూ, అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే రాజ్యాంగం, చట్టాలు, న్యాయస్థానాల అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట ప్రక్రియ ఉందని, దానిని గౌరవించాలని సూచించారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తిని




తొలగించడానికి పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరమనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలని అన్నారు.

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొత్తది కాదని, గతంలోనూ ఈ ప్రక్రియను నిర్వహించారని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా ఇలాంటి ప్రక్రియలను చేపట్టాయని పేర్కొంటూ, ఇప్పుడు అదే విధానంపై విమర్శలు చేయడం విరుద్ధ వైఖరని అన్నారు. ఓటరు జాబితాలను పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించడం ప్రజాస్వామ్యానికి అవసరమని స్పష్టం చేశారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసే విషయంలో భారత పౌరసత్వంతో పాటు చట్టపరమైన అర్హతలను పాటించాలని యామినీ శర్మ అన్నారు. విదేశీయులు చట్టవిరుద్ధంగా ఓటరు జాబితాల్లో చేరకుండా చూడాలని, అదే సమయంలో ఎవరిపైనా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయకూడదని పేర్కొన్నారు.

## కారులో మంటలు, నలుగురు సజీవ దహనం

**- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోరం.**

**- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**

**అమరావతి, మహానాడు:** విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు సజీవ దహనమవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు రెయిలింగ్‌ను కారు ఢీకొనడంతో మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

ప్రమాదంలో నలుగురు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. మృతులకు నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రమాదంపై ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ



మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ కారులో మంటలు వ్యాపించి వాహనం పూర్తిగా కాలిపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## వైసీపీది బీసీ వ్యతిరేక విధానం

**16,800 పదవులకు బీసీలను దూరం చేసిన జగన్**

**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

**వినుకొండ, మహానాడు:** వైసీపీది బీసీ వ్యతిరేక విధానమని, జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, వైసీపీ నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుకున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో దాదాపు 16,800 మంది బీసీ నాయకులు స్థానిక రాజకీయ పదవులకు దూరమయ్యారని ఆరోపించారు.

వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీసీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి బీసీ సోదరులే వెన్నెముక అని, వారికి



నిజమైన న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల రాజకీయ, సామాజిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జువ్వలపాలెం గ్రామం వద్ద 5 గ్రామాలకు మంచి నీటి సరఫరాకు సెంబకార్ప్ పవర్, జిందాల్ పవర్ ల సహకారంతో 150 లక్షల వ్యయంతో నిర్మించిన పంపింగ్ మరియు పైప్ లైన్ ప్రాజెక్టను ఏపిఐసి చైర్మన్ రామరాజుతో కలసి ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు**




## ఏపీ మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా జస్టిస్ సత్యనారాయణమూర్తి!

**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా జస్టిస్ సత్యనారాయణమూర్తిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన ఆయన నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నియామకానికి సంబంధించిన దస్త్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు గవర్నర్‌కు పంపించారు.



## ఈడీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**- మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు**

**మంగళగిరి, మహానాడు:**
తన అవినీతి, దోపిడీ ఆరోపణలు బయటపడుతున్నాయన్న భయంతోనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన దర్యాప్తు సంస్థలపై నిందలు వేస్తూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. ఈడీపై నిరాధార ఆరోపణలు చేసినందుకు జగన్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ మేరకు తీవ్ర విమర్శలు చేశారు.

గతంలో కర్నూలులో సీబీఐ అధికారులపై జగన్ వర్గీయులు దౌర్జన్యాలకు పాల్పడటం, విధి నిర్వహణలో ఉన్న అధికారులపైనే ఎదురు కేసులు పెట్టించి అధికారాన్ని దుర్వినియోగం చేసిన తీరు రాష్ట్ర ప్రజలకు గుర్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు చట్టబద్ధమైన దర్యాప్తు సంస్థల విశ్వసనీయతపైనే నిందలు మోపడం సిగ్గుచేటని అన్నారు.

గాలి జనార్దన్ రెడ్డితో కలిసి ఓబుళాపురం మైనింగ్‌లో సహజ సంపదను కొల్లగొట్టారంటూ జగన్‌పై ఆరోపణలు చేశారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు, మద్యం విధానం, జే-ట్యాక్స్ పేరుతో అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆరోపణలను ప్రస్తావిస్తూ జగన్ రాజకీయాలపై విమర్శలు చేశారు. నాసిరకం మద్యం కారణంగా పేదల ప్రాణాలు పోయాయంటూ ఆరోపించారు.

తనపై ఉన్న అవినీతి, హత్యా రాజకీయాల ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ ఈడీపై బురదజల్లుతున్నారని నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. జగన్ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి



లేదన్నారు.

జగన్‌కు నిజంగా ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే డిశ్చార్జ్ పిటిషన్లతో జాప్యం చేయకుండా సీబీఐ కోర్టు ఎదుట హాజరై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ కేసుల విచారణను వేగవంతం చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకుని, ప్రజాధనాన్ని తిరిగి ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర పునర్నిర్మాణానికి వినియోగించాలని నక్కా ఆనంద్ బాబు డిమాండ్ చేశారు.

## 12వ పీఆర్సీ చైర్మన్‌గా దినేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**- ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపుపై అధ్యయనం**

**- ఏడాదిలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పణ**

**- అన్ని శాఖలు, ఉద్యోగ సంఘాల నుంచి వివరాల సేకరణ**

**అమరావతి, మహానాడు:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపునకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సోమవారం ఏపీ సచివాలయంలో ఆయన పీఆర్సీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1983 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దినేష్ కుమార్ గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

ఈ నెల 1వ తేదీన దినేష్ కుమార్‌ను చైర్మన్‌గా నియమిస్తూ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు 200 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిలోగా పీఆర్సీ నివేదికను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఈ



నేపథ్యంలో ఆయన తాజాగా బాధ్యతలు స్వీకరించారు.

పీఆర్సీ చైర్మన్‌గా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించడంతోపాటు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి పూర్తి వివరాలు తీసుకోనున్నారు. ఆయా వివరాలపై సమగ్ర అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపునకు సంబంధించిన సిఫార్సులతో కూడిన నివేదికను ఏడాది గడువులోగా ప్రభుత్వానికి సమర్పించనున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, అదనపు కార్యదర్శి గౌతమ్ అల్లాడ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణతోపాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా దినేష్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## తిరుపతికి భారీ ఇన్ ఫ్రా ప్రాజెక్టులు

**- ముఖచిత్రం మార్చేస్తున్న చంద్రబాబు**

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వచ్చే శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఆధ్యాత్మిక నగరి రూపురేఖలను సమూలంగా మార్చేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

తిరుపతిలో సుమారు రూ.3,200 కోట్ల భారీ వ్యయంతో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్, టీటీడీ ఉద్యోగుల లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పన, తుడా మాస్టర్ ప్లాన్ రహదారుల



విస్తరణ పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ప్రస్తుతం తిరుమలకు రోజూ 80 వేల నుంచి 90 వేల మంది భక్తులు వస్తుండటంతో కొండపై అందరికీ వసతి దొరకడం కష్టంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఉన్న గాఎ జూపార్కు వద్ద 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,750 కోట్లతో ఈ మెగా పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌కు శ్రీకారం చుట్టారు.

ఈ భారీ టౌన్‌షిప్ ద్వారా ఒకేసారి ఏకంగా 26 వేల మంది భక్తులకు వసతి సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఇందులో జి+9 విధానంలో నిర్మించే నాలుగు బ్లాకుల్లో 10 వేల మందికి, జి+4 విధానంలో నిర్మించే మరో నాలుగు పిల్‌గ్రిమ్ ఎమినిటీ కాంప్లెక్స్ బ్లాకుల్లో 16 వేల మంది భక్తులకు వసతి సౌకర్యాలు కల్పిస్తారు. సొంత వాహనాల్లో తిరుపతికి వచ్చే భక్తుల కోసం జి+5 అంతస్తుల్లో దాదాపు 4,500 వాహనాలు పట్టేలా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం నిర్మిస్తున్నారు. దీనికి తోడు జి+3 భవనంలో సెంట్రలైజ్డ్ కిచెన్‌తో ఒకేసారి 6,000 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా భవనాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. కొండపైకి వెళ్లే భక్తుల కోసం జి+2 విధానంలో 30 బస్ బేలను ఏర్పాటు చేయడంతో పాటు శ్రీవారి వైభవాన్ని చాటిచెప్పేలా డిజిటల్ మ్యూజియం, థియేటర్, గ్యాలరీలను కూడా ఈ ప్రాజెక్ట్‌లో పొందుపరిచారు.

మరోవైపు వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద 432 ఎకరాల పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన 5,192 మంది టీటీడీ ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు సీఎం చంద్రబాబు మౌలిక వసతుల కల్పన ద్వారా తెరదించారు. స్థలాలు ఇచ్చినా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారు. టీటీడీ



బోర్డు ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, అధికారుల సమక్షంలో తీసుకున్న నిర్ణయం మేరకు సుమారు రూ.230 కోట్ల వ్యయంతో ఈ లేఅవుట్‌లో పక్కా బీటీ రోడ్లు, డ్రెయిన్లు, వర్షపు నీటి కాల్వలు, మంచి నీటి పైప్‌లైన్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ లైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నారు.

తిరుపతి నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తిరుచానూరు ఆలయానికి వెళ్లే రహదారులతో పాటు నగరంలోని ముఖ్యమైన మార్గాలను విస్తరించేందుకు తుడా సిద్ధమైంది. సుమారు రూ.250 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి పనులకు కూడా చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. తుడా, టీటీడీల ఉమ్మడి భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ భారీ అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే శ్రీవారి భక్తులకు వసతి, రవాణా కష్టాలు తీరడమే కాకుండా, తిరుపతి ఆధ్యాత్మిక నగరిగా సరికొత్త శోభను సంతరించుకోనుంది.




చెన్నైలో ఇద్దరు విజయుల ఆత్మీయ కలయిక

www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు ®

Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026



## కేసుల పరిష్కారంలో ఏపీ ఆర్‌టీఐ కమిషన్‌కు జాతీయ గుర్తింపు

**ఆన్‌లైన్‌లోనే 95 శాతం విచారణలు..**

**ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 7,034 కేసుల పరిష్కారం**

**వచ్చే నెలాఖరుకు 2013-2023 మధ్య పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యం**

**చట్టాన్ని దుర్వినియోగం చేసిన తొమ్మిది మందిపై చర్యలు..**

**జిల్లాల్లో ప్రత్యేక అధికారుల నియామకానికి ప్రతిపాదనలు**



**మంగళగిరి, మహానాడు:** కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం కమిషన్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సామాన్యుడి చేతిలో ఈ చట్టం శక్తివంతమైన ఆయుధమని, ఉన్నత స్థాయిలో ఉన్న అధికారి పనితీరుపై కూడా సమాచారం పొందే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్ర సమాచార కమిషన్ మెరుగైన పనితీరు కనబరుస్తోందని ప్రధాన కమిషనర్ తెలిపారు. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 7,034 కేసులను పరిష్కరించి చరిత్ర సృష్టించిందన్నారు. ప్రస్తుత కమిషనర్లు ఇప్పటివరకు 10 వేల కేసులను పరిష్కరించినట్లు ప్రశంసించారు. 2024లో 3,252 కేసులు, 2025లో 3,326 కేసులు మాత్రమే పరిష్కరించినట్లు వివరించారు. 2024లో 6,635 కేసులు, 2025లో 6,423 కేసులు, 2026 సెప్టెంబర్ నాటికి 4,894 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి 8 వేలకుపైగా కేసులు నమోదవుతాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

కేసులను వేగంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా 2013 నుంచి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ వచ్చే నెలాఖరులోగా పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన కేసుల పరిష్కారానికి కూడా సన్నద్ధమవుతున్నామన్నారు. అవసరాన్ని బట్టి ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనాలు, ముగ్గురు సభ్యులతో కూడిన పూర్తి ధర్మాసనాలను ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. మొదట వచ్చిన కేసును మొదట పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అవసరాన్ని బట్టి కొత్తగా వచ్చిన దరఖాస్తులనూ పరిశీలిస్తున్నట్లు వివరించారు.

ప్రజలు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ స్థాయి నుంచే ఆన్‌లైన్ ద్వారా విచారణలు నిర్వహిస్తూ, దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ప్రయాణ ఖర్చులు, ఇబ్బందులు లేకుండా చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ విచారణలకు అవసరమైన ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ప్రస్తుతం 95 శాతం విచారణలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని, సమీప ప్రాంతాల్లోని వారు మాత్రమే సుమారు ఐదు శాతం మేరకు నేరుగా హాజరవుతున్నారని తెలిపారు.

ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు ఆన్‌లైన్ విచారణకు హాజరయ్యారని ఉదహరించారు. ఆన్‌లైన్ విచారణలను సుప్రీంకోర్టు సైతం ప్రశంసించిందని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని సూచించినట్లు వివరించారు. ఆన్‌లైన్ విచారణల విధానాన్ని అధ్యయనం చేసేందుకు గత నెల 27న తమిళనాడు సమాచార హక్కు కమిషన్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చారని తెలిపారు.

సమాచార హక్కు చట్టం అమలును మెరుగుపరిచేందుకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తిస్తున్నట్లు ప్రధాన కమిషనర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 263 కార్యాలయాలను తనిఖీ చేయగా, 162 కార్యాలయాల్లో లోపాలు గుర్తించి ప్రజా సమాచార అధికారులు, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి నెలా నిర్వహిస్తూ నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం జిల్లాల్లో సమాచార హక్కు చట్టం నోడల్ అధికారులుగా జిల్లా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. అయితే ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఇద్దరు అధికారులను నియమించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. సమాచార హక్కు చట్టాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసిన తొమ్మిది మందిని నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలిపారు. అటువంటి వారిని ఉపేక్షించబోమని, స్వార్థపరులకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పౌరులు తమ ప్రాథమిక హక్కులను సాధించుకునేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరమైనదని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) నిబంధనలను అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానం మరింత పెరగాలని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కమిషనర్లు చావలి సునీల్, డా. రెహానా బేగం, గాజుల అదెన్న, డా. అల్లారెడ్డి ఉదయ భాస్కర రెడ్డి, శరత్ చంద్ర కల్యాణ్ చక్రవర్తి వట్టికూటి, వంటేరు రవి బాబు, పి.ఎన్. నాయుడు, కమిషన్ కార్యదర్శి సి.హెచ్. పద్మావతి దేవి, ఉప కార్యదర్శి కె. నరసింహారావు, న్యాయ కార్యదర్శి వి. రఘురామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తౌషిక్ హత్య, మౌళాభీ ఆత్మహత్య కేసుల్లో నిష్పక్షపాత విచారణ జరపాలి

**చంద్రబాబు ప్రభుత్వం ఇకనైనా మేలుకోవాలి**

**ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్**



**ప్రకాశం జిల్లా, మహానాడు:**

తౌషిక్‌ను హత్య చేసిన పాఠశాల యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని, బాలుడి తల్లి మౌళాభీ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతోపాటు, వారికి అండగా నిలిచిన జిల్లా విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని కోరారు. తౌషిక్ హత్య, మౌళాభీ ఆత్మహత్య కేసులను నీరుగార్చేందుకు కుట్ర చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని, చట్టప్రకారం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మూడంచెల భద్రత పేరుతో ముళ్లకంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేసి ఒంగోలు నగరాన్ని అష్టదిగ్బంధనం చేశారని మందకృష్ణ మాదిగ విమర్శించారు. ప్రజా ఉద్యమకారులను అరెస్టు చేయడంతోపాటు గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. నిందితులతో పోలీసులు కుమ్మక్కు కావడం వల్లే మౌళాభీ ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. రాజకీయ జోక్యం కారణంగానే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇకనైనా మేలుకోవాలని సూచించారు.

తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీ మాగుంట, జిల్లా అధ్యక్షుడు ఉగ్ర నరసింహారెడ్డి నిందితులకు రాజకీయంగా అండగా నిలుస్తున్నారని మందకృష్ణ ఆరోపించారు. వైసీపీకి చెందిన రమణారెడ్డిని కాపాడటం వల్లే తౌషిక్ హత్య కేసు విచారణలో జాప్యం జరిగిందని, దాని ఫలితంగా మానసిక వేదనకు గురైన మౌళాభీ ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. ఈ పరిణామాలే తమ ఉద్యమం ఈ స్థాయికి చేరడానికి కారణమని అన్నారు.

సాంకేతికంగా, భౌతికంగా తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ, మానసికంగా మాత్రం వైసీపీకి చెందిన రెడ్డి నాయకుల కోసమే పనిచేస్తున్నారనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని మందకృష్ణ మాదిగ కోరారు. వైసీపీ నాయకులను కాపాడుతున్నారనే విషయాన్ని మరిచిపోవద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

తౌషిక్, మౌళాభీ కేసులపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎందుకు మౌనంగా ఉన్నారని మందకృష్ణ ప్రశ్నించారు. ఈ ఘటనలను కనీసం ఎందుకు ఖండించలేదని నిలదీశారు. ప్రధాన నిందితుడు రమణారెడ్డి వైసీపీ నాయకుడు కావడం వల్లే జగన్ స్పందించడం లేదని ఆరోపించారు. అయితే, నిందితులను జైలుకు పంపకుండా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కాపాడుతున్నారనే ఆరోపణల వెనుక కారణమేంటని ప్రశ్నించారు. రెడ్డి నాయకులు పరస్పరం ఏకమయ్యారనే విషయాన్ని మరిచిపోవద్దని వ్యాఖ్యానించారు.

తాము ధర్నాకు పిలుపునిస్తే వెళ్లవద్దని వైసీపీలోని ముస్లింలను ఆ పార్టీకి చెందిన రెడ్డి నాయకులు నియంత్రిస్తున్నారని, అదే విధంగా తెలుగుదేశం పార్టీలోని ముస్లింలను ఆ పార్టీకి చెందిన రెడ్డి నాయకులు నియంత్రిస్తున్నారని మందకృష్ణ ఆరోపించారు. రెండు పార్టీల్లోని కొందరు నాయకులు నిందితులను కాపాడుతున్నారనే విషయాన్ని చంద్రబాబు గుర్తించాలని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఇలాంటి నాయకులే రాజకీయంగా ముఖ్యమంత్రిని దెబ్బతీసే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఈ పరిణామాలకు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీనే కారణమని మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వారి కారణంగా ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. త్వరగా ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ఇప్పుడు ప్రకటిస్తున్న అధికారులు ఇంతకాలం ఎందుకు వేగంగా హైకోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలను విచారణ అధికారులు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. ఈ కేసుల్లో నిష్పక్షపాత విచారణ జరుగుతుందనే నమ్మకం తమకు లేదని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించే వరకు ఎవరూ విచారణకు హాజరుకావద్దని పిలుపునిచ్చారు.

## సిరిమాను వృక్షానికి ముహూర్తం

**జొన్నవలసలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, మహానాడు:**

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవానికి సంబంధించి కీలక ఘట్టం ప్రారంభమైంది. అమ్మవారి సిరిమానును తరలించేందుకు ఎంపిక చేసిన జొన్నవలస గ్రామంలోని వృక్షానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొడ్డలితో వృక్షానికి గంటు పెట్టి ముహూర్త కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి సంవత్సరం అమ్మవారు ఒక గ్రామంలోని సిరిమాను వృక్షాన్ని కోరుకుంటారని, ఈ ఏడాది జొన్నవలస గ్రామంలోని వృక్షాన్ని ఎంపిక చేసుకున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సిరిమాను వృక్షాన్ని తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఏటా నిర్వహించే సంప్రదాయం ప్రకారమే ఈ ఏడాది కూడా పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు.

పైడితల్లి పండగకు ఉత్తరాంధ్ర ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని మంత్రి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా విజయనగరం ఉత్సవాలను కూడా వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు మంత్రి తెలిపారు. ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. విజయనగరం కళలకు కాణాచి అని, ఈ ప్రత్యేకతకు తగినట్లుగా ఆలయానికి రంగులు అద్ది, విభిన్న కళారూపాలతో అలంకరించినట్లు పేర్కొన్నారు. నూతన రూపంలో సిద్ధమైన ఆలయాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. పండగకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ, ఉత్సవాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. అందరూ భక్తిశ్రద్ధలతో పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ఆస్వాదించాలని పిలుపునిచ్చారు.

## రైతులు కరవుతో చస్తుంటే ఢిల్లీకి రేవంత్ పరార్

- నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై తెలంగాణ బీజేపీ అభినందన తీర్మానం
- ఓట్ల డిలీషన్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బహిరంగ సవాల్..!
- కనీసం సీఈవో ఆఫీసుకు 10 మందిని తీసుకురాగలరా?
- ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని చెప్పే రేవంత్ రెడ్డికి అసలు శ్రీరాముడి పేరు ఎత్తే అర్హతే లేదు
- మీకున్న ఆ రాక్షస లక్షణాలకు, ఆ వైఖరికి మీకు ఒసామా బిన్ లాడెన్ సరిపోతాడు తప్ప శ్రీరాముడు ఎట్లా అవుతాడు?
- ఆరు గ్యారెంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసేవరకు రాహుల్ గాంధీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం.
- రాష్ట్రంలో డ్రగ్స్ ఏరులై పారుతుంటే.. గోవాలో రేవంత్ రెడ్డి నీతులు చెప్తారా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



**హైదరాబాద్, మహానాడు:** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు ముంచుకొచ్చి, తాగునీరు–సాగునీరు లేక రైతులు అల్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే, బాధ్యతారాహిత్యంగా అత్యవసర కేబినెట్ భేటీని రద్దు చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి పారిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఓ మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అభిషేక్ జిగిని, సురేష్, వెంకట్ రెడ్డిలతో కలిసి ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు మిస్ అయ్యాయంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానని ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మీరు వేలమందిని తీసుకురానక్కర్లేదు, స్టేట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ దగ్గరకు మీ వెంట మీ మజ్లిస్ దోస్తులు అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఓవైసీలను తీసుకొచ్చినా పర్లేదు..

కనీసం ఓట్లు పోయిన 10 మందిని సీఈవో ఆఫీసుకు తీసుకురండి. నేనూ వస్తాను. కంప్యూటర్లలో రికార్డులు పరిశీలిద్దాం. నోటీసు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఏ ఒక్క ఓటూ డిలీట్ కాదు. అర్హులైన వారి ఓటు డిలీట్ అయిందని నిరూపిస్తే అక్కడికక్కడే నమోదు చేయించే నిబంధనల ప్రకారం పని చేద్దాం. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. ఇక్కడ రైతులు చనిపోతుంటే పట్టించుకోకుండా పనికిమాలిన అంశాలపై ఢిల్లీకి పోయి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

గోవా కాంగ్రెస్ యాత్రలో నిలబడి బీజేపీని 'రావణుడు', తమను 'రాముడు' అని రేవంత్ రెడ్డి పోల్చుకోవడం అత్యంత హాస్యాస్పదమని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో "ముస్లిం ఈజ్ కాంగ్రెస్ – కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అన్న రేవంత్ రెడ్డికి రాముడి పేరు పలికే నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. అసలు రాముడే ఒక కాల్పనిక పాత్ర అని కోర్టుల్లో అఫిడవిట్లు సమర్పించి, రామాలయ నిర్మాణం జరగకుండా సుప్రీంకోర్టులో పెద్ద పెద్ద అడ్వకేట్లను పెట్టి వాదించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని నిలదీశారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠకు రాహుల్ గాంధీ గానీ, కాంగ్రెస్ నాయకులు గానీ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.

ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని చెప్పే రేవంత్ రెడ్డికి అసలు శ్రీరాముడి పేరు ఎత్తే అర్హతే లేదు, మీకున్న ఆ రాక్షస లక్షణాలకు, ఆ వైఖరికి మీకు ఒసామా బిన్ లాడెన్ సరిపోతాడు తప్ప శ్రీరాముడు ఎట్లా అవుతాడు? అని సూటిగా ప్రశ్నించారు. మొన్న రాముడు రిచ్ మ్యాన్ గాడ్ అని చెప్పిన రేవంత్, ఇవాళ సడన్‌గా రాముడిని ఓట్ల కోసం వాడుకుంటూ హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీస్తున్నారని, తెలంగాణలో నిత్యం దేవాలయాలపై దాడులు జరుగుతుంటే పట్టించుకోని వీళ్లు హిందూ సమాజం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో నీళ్లు లేక, పల్లెల్లో కరెంట్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే.. రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనుల కోసం ప్రజాధనంతో ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు ఉంటే కోర్టుల్లో పిటిషన్లు వేయాలి తప్ప, సుప్రీంకోర్టు సీజేఐపై ఒత్తిడి తెచ్చేలా రోడ్లెక్కి మార్చ్ చేస్తామనడం న్యాయవ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేయడమేనని అన్నారు.

ఎన్నికల సంఘం, రాష్ట్రపతి వద్ద ఎలాంటి ఆధారాలు చూపలేకపోయిన కాంగ్రెస్, ప్రశాంత్ కిషోర్ వంటి అర్బన్ నక్సల్స్ సహకారంతో దేశంలో హింసను, అరాచకాన్ని ప్రేరేపించాలని చూస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు. లాఠీలు పట్టుకున్న పోలీసులు గన్స్ వాడేలా సమాజంలో బీభత్సం సృష్టించాలనే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సీఏఏ సమయంలో షాహీన్ బాగ్‌లో నెలల తరబడి అడ్డాలు వేసి మతకల్లోలాలు సృష్టించిన కాంగ్రెస్, ఆప్ టీమ్‌లకు బంగ్లాదేశ్‌లోని జమాతే ఇస్లామీ వంటి రాడికల్ సంస్థల మద్దతు ఉందని మండిపడ్డారు.

గోవాలో నిలబడి ప్రసంగాలు దంచే రేవంత్ రెడ్డి.. ముందు తెలంగాణలో డ్రగ్స్ ఏ విధంగా ఏరులై పారుతున్నాయో చూడాలని హితవు పలికారు. గంజాయి, చరస్, కొకైన్, ఎండీఎంఏ వంటి మత్తుపదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతూ తెలంగాణ డ్రగ్స్ మార్కెటింగ్ సెంటర్‌గా మారిందని, నిన్నగాక మొన్ననే కోట్లాది రూపాయల విలువైన 2 కేజీల ఎండీఎంఏ పట్టుబడిందని గుర్తుచేశారు. విద్యార్థులు, యువత భవిష్యత్తు నాశనమవుతుంటే కట్టడి చేయలేని సీఎం, పక్క రాష్ట్రాల్లో వెళ్లి నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు.

## బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు జగన్ కుట్ర

- బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే కూటమి లక్ష్యం :
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**కాకినాడ, మహానాడు:** బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాకినాడలోని జీఆర్‌టీ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించే విషయంలో వైఎస్సార్‌సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

దివంగత ఎన్టీ రామారావు నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరకు తెలుగుదేశం పార్టీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు రాజకీయ అవకాశాలు పెంచడమే తమ ఉద్దేశమన్నారు. న్యాయస్థానాల తీర్పులకు అనుగుణంగా రిజర్వేషన్ల అంశంలో ముందుకు సాగుతూనే, పార్టీ తరఫున తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. బీసీలు మొదటి నుంచి టీడీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి సుమారు రూ.లక్ష కోట్ల విలువైన ప్రతిపాదనలు ఉన్నట్లు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ.30,136 కోట్ల వ్యయంతో 50,315 పనులు చేపట్టి, అదనంగా 27.36 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రోజుకు 1,426 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, 13,075 ఓవర్‌హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్లు, 77,243 కిలోమీటర్ల పంపిణీ పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, మురుగునీటి ఇబ్బందులు, పారిశుధ్య లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడమే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యమని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణానికి మళ్లీ ఊపునిచ్చామని తెలిపారు. 2028 నాటికి అమరావతి అభివృద్ధి తొలి దశను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని చెప్పారు. రాజధానిలో రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని, వీటి ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

పోలవరం ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పోలవరంతో పాటు రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీటి లభ్యత పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

భోగాపురం విమానాశ్రయంతో పాటు ఇతర విమానాశ్రయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. నాలుగు పోర్టుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానం మెరుగుపడితే రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు, తాగునీటి వ్యవస్థలు, మురుగునీటి పారుదల, ఇతర మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి పనుల కంటే రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విషయంలో జగన్ సానుకూలంగా వ్యవహరించడం లేదని, రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను న్యాయస్థానాల్లో సవాలు చేయడం వల్ల రాజకీయ ప్రాతినిధ్యానికి ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.

మద్యం విధానం, అవినీతి ఆరోపణలు, వివిధ కేసుల్లో నాయకులు, అధికారులపై జరుగుతున్న విచారణలను ప్రస్తావిస్తూ జగన్ నాయకత్వంపై మంత్రి విమర్శలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, రూ.40 కోట్ల సుపారీకి సంబంధించిన అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై జగన్ కుటుంబం వైపు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు.

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. నియామకాలపై వైసీపీ అపోహలు సృష్టిస్తూ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కృషిని అవమానిస్తోందని ఆరోపించారు. కష్టపడి అర్హత సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ సిటీ టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరేంద్రనాథ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

## కుప్పంలో కృష్ణానదీ జలాలు పారుతుంటే మరి నువ్వెందుకు నీళ్లు ఎత్తుతలేవు?

మొదటి పేజీ తరువాయి..

గోదావరి నుంచి 500 టీఎంసీల నీళ్లు నేను పట్టిసీమ ద్వారా ఇప్పటిదాకా ఎత్తిన అని.. పట్టిసీమ నీళ్లెత్తి కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాలకు, డెల్టాకు ఇవాళ ఏపీ నీళ్లు పారిస్తుంది.. ఎందుకు అక్కడనేమో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ బంద్ పెడితే.. కిందికెళ్లి ఆయన శ్రీశైలంకెళ్లి వెలిగొండకు తీసుకెళ్తున్నడు. కుప్పం తీసుకుపోతున్నడు.. ఇక్కడ గోదావరిలో కన్నెపల్లిలో కటుక ఒత్తుమంటే.. నిన్నటిదాకా ఎన్‌డీఎస్‌ఏ పేరు చెప్పి తప్పించుకున్నవ్. దేవాదుల దగ్గర కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టు ఉంది.

24 గంటలు మోటార్లు నడుపవయా అంటే నేను 8 గంటలే మోటార్లు నడుపుతా అంటడు. నీళ్లు లేక కాదు ఇది.. ఈ ప్రభుత్వం వైఫల్యం వల్ల. చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఇవాళ కరువు పరిస్థితులు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. పాలమూరు ద్రోహి రేవంత్ రెడ్డి. పాలమూరులో నువ్వు శ్రీశైలంలో నీళ్లు ఎత్తకపోవడం వల్ల పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు పోతున్నయి. వెలిగొండకు నీళ్లు పోతున్నయి. కుప్పంకు నీళ్లు పోతున్నయ్.. ఎందుకు 24 గంటలు మోటార్లు నడుపుతలేవు అని ప్రశ్నించారు. ఏపీలో లేని కరువు తెలంగాణలో ఎందుకు ఉంది? అని హరీశ్ రావు ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకనే ఈరోజు తెలంగాణలో కరువు పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి నదులు పారుతుంటే రేవంత్ రెడ్డి నీటిని వదిలిపెడుతున్నాడు, చంద్రబాబు ఒడిసిపడుతున్నాడని అన్నారు.

నిన్న రాష్ట్రంలోని రైతులందరికీ కూడా ఉదయం 11 గంటలకల్లా రైతు వేదికల దగ్గరకు రండి.. మీతో ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతారని వ్యవసాయ శాఖ అధికారులు, రాష్ట్రంలోని రైతులందరికీ కూడా ఇది అగ్రికల్చర్ కమిషనర్ ఇచ్చిన నోట్. 11 గంటలకు మీరు రైతు వేదికల వద్ద ఉండండి.. ప్రభుత్వం మీకు చాలా విలువైన సూచనలు రైతులు ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోవాలో చెప్తారు. ఈ ఎల్‌నినో నేపథ్యంలో రైతులంతా రైతు వేదికల వద్దకు రావాలని ప్రభుత్వం ఇచ్చిన సర్క్యూలర్ అన్నారుమా ఎమ్మెల్యేలు.. ఇది మా జిల్లా డీఏవో నాకు పంపిన వాట్సాప్ మేసేజ్.

12గంటలకు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతులనుద్దేశించి అన్నీ రైతు వేదికల్లో ముఖ్యమంత్రి మాట్లాడుతరు.. మీరు రండి అని వ్యవసాయ అధికారులు ఎమ్మెల్యేలకు పంపిన మెసేజ్ ఇది. ఉదయం 9:52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ క్యాన్సిల్ అని మెసేజ్ పెట్టారు. మళ్లీ 11:15 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంది రండి అని చెప్పి 11:30కు మొదలవుతుందన్నారు. మళ్లీ కాసేపటికి 1:00 గంటలకు సీఎం రాడు, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి వస్తారని చెప్పారు.

అంటే రాష్ట్ర రైతులు ఇబ్బందులు పడుతుంటే వీళ్లు చిన్న పిల్లల ఆటలు ఆడుతున్నారని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రులు గోవా, ఢిల్లీ అని ట్రిప్పులు వేస్తున్నారని ఆరోపించారు.

# కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం

**రూ.100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు**

**సీఐఐ ప్రాంతీయ సదస్సులో అవగాహన ఒప్పందం**

**మత్స్యకారులకు మెరుగైన సముద్ర సమాచార సేవలు**

**రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు చొరవతో ముందడుగు**



**కాకినాడ, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ సముద్ర రంగ అభివృద్ధికి, తీరప్రాంత మత్స్యకారులకు మెరుగైన సమాచార సేవలు అందించేందుకు కాకినాడలో భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కాయిస్) ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. కాకినాడలో నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సులో ఈ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టుకు దశలవారీగా రూ.100 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించగా, 20 ప్రత్యక్ష, 50 పరోక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది.

ఈ కేంద్రం ఏర్పాటుకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తీరప్రాంత మత్స్యకారులకు సముద్ర పరిస్థితులు, చేపల వేటకు అనుకూలమైన ప్రాంతాలు, వాతావరణ సంబంధిత సమాచారాన్ని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు.

ఈ క్రమంలో 2026 జులై 21న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌ను కలిసి కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఈ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 9న ఎంపీకి సమాచారం అందించింది. ఇన్‌కాయిస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భూమి కేటాయింపు కోసం సంప్రదించగా, జిల్లా యంత్రాంగం అనువైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపింది.

ఈ ప్రాంతీయ కేంద్రం అందుబాటులోకి వస్తే సంభావ్య చేపల వేట ప్రాంతాల సూచనలు, సముద్ర పరిస్థితుల సమాచారం, ట్యూనా, హిల్సా చేపల వేటకు సంబంధించిన సేవలు తీరప్రాంత ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. పగడపు దిబ్బలపై సముద్ర ఉష్ణోగ్రతల ప్రభావానికి సంబంధించిన హెచ్చరికలు, సముద్ర పరిశీలన సమాచారం కూడా అందుబాటులోకి రానున్నాయి. దీంతో మత్స్యకారులు సమాచార ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి, సముద్ర వనరులను మెరుగ్గా వినియోగించుకోవడానికి వీలవుతుంది.

కాకినాడ ఓడరేవు, విస్తారమైన సముద్ర తీరం, ఆక్వా రంగం, మత్స్య సంపదకు ఈ కేంద్రం మరింత ప్రాధాన్యం తీసుకురానుంది. సముద్ర సమాచార సేవలతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అనుబంధ సేవల రంగాల్లోనూ అవకాశాలు విస్తరించనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన లక్ష్యాలకు అనుగుణంగా కాకినాడను సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఈ ఒప్పందం ముందడుగుగా నిలవనుంది.

# పేదల వైద్యానికి 'సీఎంఆర్ఎఫ్' భరోసా!

**514 మందికి చెక్కుల మంజూరు..**

**ఇప్పటివరకు రూ.5.23 కోట్ల ఆర్థిక తోడ్పాటు**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ**



**కోటబొమ్మాళి, మహానాడు:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందుతోంది. ఇందులో భాగంగా కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు 67 మంది లబ్ధిదారులకు రూ.33,70,344 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన లబ్ధిదారులకు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో చెక్కులు అందజేశారు.

కార్యాలయం ద్వారా ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం మొత్తం 604 దరఖాస్తులను పంపించగా, వాటిలో 514 చెక్కులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు లబ్ధిదారులకు మొత్తం రూ.5,23,17,565 (ఐదు కోట్ల ఇరవై మూడు లక్షల పదిహేడు వేల ఐదు వందల అరవై ఐదు రూపాయలు) ఆర్థిక సహాయం అందింది. మరో 84 దరఖాస్తులు సంబంధిత విభాగంలో పరిశీలనలో ఉన్నాయి.

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందేలా దరఖాస్తుల ప్రక్రియను కొనసాగిస్తూ, మంజూరైన ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేస్తున్నారు.

# రూ.9 కోట్లతో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ పనులు ప్రారంభం



**దర్శి మహానాడు:** దర్శి నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రారంభమయ్యాయని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పాఠశాల ఏర్పాటుకు రూ.22 కోట్లు కేటాయించగా, రూ.2 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయని తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. వాటిని తిరిగి ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పలుమార్లు కోరగా, తొలి విడతలో రూ.9 కోట్లతో పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, ఆర్అండ్‌బీ అధికారులు గోపికృష్ణ, రఫీ, టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు.. తెలంగాణలో బీజేపీకి నిర్బంధాలా?

**- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి**

**ఢిల్లీ:** రాజ్యాంగాన్ని కాపాడతామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని, ప్రతిపక్షాల గొంతుకను గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ పదేపదే చెబుతోంది. కానీ ఢిల్లీలో ఆ పార్టీ చెబుతున్న మాటలకు, తెలంగాణలో వారి ప్రభుత్వం చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన కనిపించడం లేదని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణికి ఢిల్లీలో, హైదరాబాద్‌లో జరుగుతున్న తాజా పరిణామాలే ప్రత్యక్ష సాక్ష్యం అని తెలిపారు.



గత 3,4 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనల కారణంగా.. ప్రజలకు అసౌకర్యం కలిగినా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా వారికి నిరసన తెలిపే అవకాశాన్ని అనేకసార్లు ఢిల్లీ పోలీసులు కల్పించారని ఆయన గుర్తు చేశారు. ప్రియాంక గాంధీ రోడ్డుపై పడుకున్నా, బారికేడ్లపైకి ఎక్కి జుగుప్సాకరంగా రాహుల్ వ్యవహరించినా.. వారి భావప్రకటన స్వేచ్ఛను పోలీసులు, ప్రభుత్వం గౌరవించాయని చెప్పారు.

రాహుల్ గాంధీ దేశమంతా స్వేచ్ఛగా తిరుగుతూ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని, ప్రధాని మోదీపైన, కేంద్ర ప్రభుత్వంపైన తప్పుడు ఆరోపణలు, పచ్చి అబద్ధాలతో తీవ్రంగా విమర్శిస్తున్నారని, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, భారత సైన్యం వంటి సంస్థలపైనా ఆరోపణలు చేస్తున్నారని వివరించారు. వారు అబద్ధాలు ప్రచారం చేసినా.. రాజకీయంగా ఆయన మాట్లాడే హక్కును అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఏనాడూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు.

అంతేకాదు, రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లోనూ కాంగ్రెస్ నాయకులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి, లోక్ భవన్ ముందు బైఠాయించారని, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొంటూ కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేపట్టేందుకు శాంతిభద్రతలు అడ్డురావా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

మరి ఢిల్లీలో కాంగ్రెస్‌కు కావాల్సిన ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలో బీజేపీకి ఎందుకు ఉండకూడదు? బీజేపీ నాయకులు ప్రజల సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే మాత్రం తెలంగాణ ప్రభుత్వానికి శాంతిభద్రతల సమస్యలన్నీ గుర్తుకొస్తాయా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? అని కేంద్ర మంత్రి నిలదీశారు. తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా, కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోవడం లేదని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సహా బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అనేకసార్లు గృహనిర్బంధం చేస్తూ, గొంతు నొక్కేస్తోందని ఆయన మండిపడ్డారు.

ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్లే ప్రయత్నం చేసినా వందలాది మందిని, బీజేపీ నాయకులను ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణకు వచ్చి ఎన్నో హామీలిచ్చారని చెబుతూ ఇప్పుడు ఆ హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తుంటే, వారి తరఫున గొంతెత్తుతున్న బీజేపీ నాయకులపై నిర్బంధం విధిస్తూ అడ్డుకుంటున్నారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

"ఇచ్చిన గ్యారంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగుల సమస్యలు, ప్రజాసంక్షేమ పథకాల అమలుపై మీ వైఫల్యాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా మా బాధ్యత. ఢిల్లీలో మీకు వర్తించే ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలో మీ రాష్ట్ర ప్రభుత్వంలో అమలు చేయరు. తెలంగాణలో ఒకనీతి, ఢిల్లీలో మరోనీతి అన్నట్లు ద్వంద్వ నీతితో వ్యవహరిస్తున్నారు" అని ఆయన విమర్శించారు.

మీరు ఓసారి హైదరాబాద్ కు వచ్చి.. మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఎలాంటి ప్రజాస్వామ్యం అమలవుతుందో చూసి చెప్పండి అని కిషన్ రెడ్డి హితవు చెప్పారు. సోనియా, రాహుల్, ప్రియాంకలతో కలిసి మీరు హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలపై నిలదీయడం తప్పు అని తెలంగాణ ప్రజానీకానికి చెప్పగలరా? అని సవాల్ చేశారు.





# దేశ భవిష్యత్తును నిర్మించేది 'డైమండ్ జనరేషన్'

**స్టార్టప్‌లు, పరిశోధనలు, ఆవిష్కరణలతో ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి**

**విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు**

**విజయవాడ, మహానాడు:** దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలోనే ఉందని, భారత యువతను 'డైమండ్ జనరేషన్'గా అభివర్ణించవచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన రెండో పీజీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన విద్యతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, జాతీయ భావాలను విద్యార్థుల్లో పెంపొందిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందించారు.

భారత జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు యువత ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఇదొక గొప్ప అవకాశమని, యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో 2.5 లక్షలకు పైగా అంకుర సంస్థలు (స్టార్టప్‌లు), 125 యూనికార్న్ సంస్థలు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని వివరించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటానికే పరిమితం కాకుండా.. ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక రంగాల్లో రాణించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

గత దశాబ్దంలో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం గణనీయంగా విస్తరించిందని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ దేశంగా ఎదిగిందని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, నూతన విద్యా విధానం, సెమీకండక్టర్ మిషన్ వంటి కార్యక్రమాలు యువతకు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. వీటిని అందిపుచ్చుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానంతో దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.

2047 నాటికి వికసిత భారత్, స్వర్ణాంధ్ర నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మంత్రి ఆకాంక్షించారు. వ్యక్తిగత లక్ష్యాలను సాధించడంతోపాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని సమాజ హితం, దేశాభివృద్ధికి ఉపయోగించాలని పేర్కొన్నారు.

# పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం



**సత్తెనపల్లి మహానాడు:** సత్తెనపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పథకంలో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు.

గత ఐదేళ్లలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి, ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పట్టణంలో రహదారులు, మురుగు కాలువల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రతి వార్డుకు నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజంగానే "సాక్షి"కి గుండెపోటు వచ్చింది!

**(చాకిరేవు)**

'సాక్షి" అంటే సాక్ష్యం అని అర్థం. కానీ ఆ పేరున్న పత్రికే, తన పుట్టుక వెనుకున్న అక్రమాలపై ఈడీ కేసుల్లో కటకటాల ముందు నిలబడింది. పత్రిక పేరులోనేమో సాక్ష్యం ఉంది, కానీ కోర్టు అడుగుతున్నది అదే సాక్ష్యాన్ని! ఈరోజు "ఈడీ.. ఎల్లో కేడీ!" అంటూ పేజీ నిండా కార్టూన్లు, బుల్లెట్ పాయింట్లతో దాని రోదనలు మిన్నంటింది.

ఏళ్ల తరబడి కోర్టులలో డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తూ, విచారణ జరగకుండా వాయిదాల మీద వాయిదాలు వేయించుకుంటూ వస్తున్నారు. చివరికి చట్టం ఉచ్చు బిగిస్తుంటే గింజుకోవడం ఒక్క సాక్షి పత్రికకే చెల్లింది! తెలంగాణ హైకోర్టులో ఈడీ వేసిన రిట్ పిటిషన్‌తో వెన్నులో వణుకు పుట్టిందో ఏమో గానీ, రోజువారీ విచారణ కోరితే దాన్ని "చంద్రబాబు జేబు సంస్థ" అంటూ పాత పాట అందుకుంది. తప్పు చేయనప్పుడు బోనులో నిలబడి నిర్దోషిత్వాన్ని తేల్చుకోవడానికి ఎందుకంత భయం?




దశాబ్దాలుగా కాలయాపన చేస్తూ, ఇప్పుడు న్యాయస్థానాలు వేగంగా విచారిస్తామంటే "కక్ష సాధింపు" అని రోదించడం చూస్తుంటే, లోపల దొంగ సాక్షి వెనుక దొంగ యాజమానుల భయం ఏ స్థాయిలో దద్దరిల్లుతోందో అర్థమవుతోంది!

**సాక్షి పత్రిక గుండెపోటుతో ఏడుస్తున్న దొంగ ఏడుపులేంటో, వాటి వెనుక ఉన్న చట్టపరమైన వాస్తవాలేంటో ఒకసారి చూద్దాం:**

**సాక్షి రోదన 1:** "చంద్రబాబు జేబు సంస్థగా మారిన కేంద్ర దర్యాప్తు సంస్థ... వైఎస్సార్‌సీపీ నాయకులపై యథేచ్ఛగా కేసులు, దాడులు."

చట్టం/వాస్తవం: ఈడీ అనేది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సంస్థ. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రీమ్లా, 2002) ప్రకారం ఎక్కడైతే ఆర్థిక నేరాలు, అక్రమ నగదు చలామణి జరుగుతాయో, అక్కడ ఆధారాల లభ్యతను బట్టి చట్టపరంగా చర్యలు ఉంటాయి. గంజాయి మూటలు పెట్టి కేసులు పెట్టినట్లు వీళ్ల ఖాతాల్లోనూ, ఆస్తుల దస్తావేజుల్లోనూ ఈడీ ఏమైనా సొంతంగా సృష్టించి పెట్టగలదా? దర్యాప్తులో పక్షపాతం ఉందని భావిస్తే ఆధారాలతో కోర్టులోనే సవాలు చేసే హక్కు ఉంది. హెడ్‌లైన్లతో కేసులు ఆగవు. అక్రమ ఆస్తులకు సక్రమ ఆధారాలు చూపలేకే కదా దశాబ్దంగా అదే ఏడుపు ఏడుస్తున్నారు!

**సాక్షి రోదన 2:** "కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలనడం కుట్ర"

**చట్టం/వాస్తవం:** క్రిమినల్ చట్టాల సాధారణ నియమం ప్రకారం నిందితుడు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందే. జతీూజ 205 (ప్రస్తుత దీచీూా 228) కింద హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడం మేజిస్ట్రేట్/కోర్టు విచక్షణ మాత్రమే తప్ప, అది నిందితుడి హక్కు కాదు. వ్యక్తిగత హాజరును కోరడం ఈడీ చట్టబద్ధమైన అభ్యర్థన. దాన్ని ఆమోదించాలా వద్దా అనేది హైకోర్టు నిర్ణయిస్తుంది. "మా పర్యవేక్షణలోనే విచారణ జరుగుతోంది" అని హైకోర్టు గతంలో అన్నంత మాత్రాన అది జగన్‌కు లభించిన శాశ్వత ఉపశమనం లేదా తీర్పు కాదు.

**సాక్షి రోదన 3:** "సీబీఐ ప్రధాన కేసు తేలకుండా ఈడీ ముందుకు వెళ్లడానికి వీల్లేదు."

**చట్టం/వాస్తవం:** PMLA చట్టం ప్రకారం సీబీఐ కేసుతో సంబంధం లేకుండా ఈడీ తన స్వతంత్ర దర్యాప్తును కొనసాగించవచ్చు. మనీలాండరింగ్ అనేది ఒక ప్రత్యేకమైన నేరం. నేరం ద్వారా ఆర్జించిన ఆస్తులను జప్తు చేసే పూర్తి అధికారం ఈడీకి చట్టం కల్పించింది. Vijay Madanlal Choudhary (2022) కేసులో సుప్రీంకోర్టు, PMLA నేరం మూల నేరంపై ఆధారపడుతుందని చెప్పినప్పటికీ, విచారణను పూర్తిగా ఆపాలని ఎక్కడా చెప్పలేదు. ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం వ్యాఖ్యలను వాటి అసలు ఉత్తర్వుల సందర్భం నుంచి చదవాలి తప్ప, పత్రిక బుల్లెట్ పాయింట్ల నుంచి కాదు.

పైగా, పదేళ్ల ఆలస్యానికి ఎవరు కారణమో కోర్టు రికార్డులే చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వేగవంతమైన విచారణ పొందే హక్కు నిందితులకే కాదు, ప్రజాధనం కాపాడాల్సిన వ్యవస్థకూ ఉంటుంది. గతంలో సుప్రీంకోర్టు స్పష్టంగా "ఆర్థిక నేరాలు సమాజానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్‌లాంటివి" అని తేల్చిచెప్పింది. డిశ్చార్జ్ పిటిషన్ల పేరుతో విచారణను దశాబ్దాలుగా నిలిపివేయడమే రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం.

**సాక్షి రోదన 4: "ప్రజాక్షేత్రం నుంచి తప్పించే కుట్ర"**

**చట్టం/వాస్తవం:** రోజువారీ విచారణ కోరడం వల్ల ఎవరూ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు కారు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం అనర్హత వేటు పడాలంటే కోర్టులో నేరం రుజువై శిక్ష పడాలి తప్ప, కేవలం ఆరోపణల వల్ల కాదు. నిజంగా నిర్దోషులైతే వేగవంతమైన విచారణే ప్రజాక్షేత్రంలో "క్లీన్ చిట్" తెచ్చుకోవడానికి అతిపెద్ద మార్గం.

PMLA సెక్షన్ 24 ప్రకారం తమ వద్ద ఉన్న వేల కోట్ల సంపద అక్రమమైనది కాదని, చట్టబద్ధంగా వచ్చిందేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత పూర్తిగా నిందితులపైనే ఉంటుంది. ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి చేస్తున్న కుట్రలే ఇవన్నీ! నిజాయితీ ఉంటే బెంగళూరు ప్యాలెస్‌లో గోళ్లు కొరుక్కుంటూ కూర్చోకుండా లోటస్ పాండ్‌కు వచ్చి విచారణకు హాజరవ్వడానికి వచ్చిన సమస్య ఏంటి? ఇప్పుడు అర్జెంట్‌గా విచారణను తప్పించుకోవడానికి పాదయాత్ర మొదలెట్టి కుంటి సాకులు చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గతంలో ఆర్థిక అత్యాచారం చేసిన నిందితుడు జగనుకు బెయిల్ కుదరదు అని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మర్చిపోతే ఎలా?

**సాక్షి రోదన 5: "ED పొలిటికల్ ప్రెస్‌నోట్లు, పార్టీల్లా ట్వీట్లు"**

చట్టం/వాస్తవం: PMLA కింద జరుగుతున్న దర్యాప్తు వివరాలను, జప్తులను అధికారికంగా ప్రకటించడం ఈడీకి ఉన్న సాధారణ పనితీరు. ఆ ప్రకటనలు నచ్చకపోతే కోర్టులోనే సవాలు చేయవచ్చు. ప్రతిరోజూ పేజీల కొద్దీ విషప్రచారం, ఫేక్ వార్తలను ప్రచురించే ఒక గుండెపోటు కథల పత్రిక.. ఈ విషయంలో దర్యాప్తు సంస్థలకు నీతులు చెప్పడం ఎంత హాస్యాస్పదం!

**అసలు ప్రశ్న: సాక్షి పుట్టుకే!**

ఈడీ ఛార్జిషీట్ల ప్రకారం.. జగతి పబ్లికేషన్స్ (సాక్షి)లో రూ. 10 ముఖ విలువ ఉన్న షేర్లను రూ. 350 వరకు విపరీతమైన ప్రీమియంతో షెల్ కంపెనీల చేత కొనిపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో జరిగిన నిర్ణయాలకు ప్రతిఫలంగా (క్విడ్ ప్రో కో) ఈ నిధులు మళ్లాయి. ప్రీమ్లా సెక్షన్ 3, 4 ప్రకారం నేరపూరిత సొమ్మును బదిలీ చేయడం, ఉపయోగించడం, దాచడం తీవ్రమైన నేరం.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రకారం పత్రికా స్వేచ్ఛ ఉంటుంది, కానీ ఆ స్వేచ్ఛ అనేది ఆర్థిక నేరారోపణలు, మనీలాండరింగ్ కేసుల నుంచి రక్షణ పొందే కవచం ఎంతమాత్రమూ కాదు. వై.ఎస్. భారతి రెడ్డిని ఈడీ ఈ వ్యవహారంలో A-5గా చేర్చడానికి ప్రధాన కారణం కూడా నిధుల నిర్వహణలో ఆమె పాత్రే.

కార్టూన్లు, రోదనలు, హెడ్‌లైన్లు కోర్టులో సాక్ష్యాలు కావు. ఈడీ మోపిన ఆరోపణలు నిజమో కాదో కోర్టులో ఇచ్చే ఆధారాలే తేలుస్తాయి. ఆరోపణలు తప్పయితే వాటిని తిప్పికొట్టడానికి 'రోజువారీ విచారణ' కంటే మంచి వేదిక మరొకటి లేదు.

"సాక్షి" తన పేరుకు తగ్గట్టు ఈసారి కోర్టు బోనులో నిలబడి సరైన సాక్ష్యం చూపించాలి.

అధికారం కోసం తండ్రి శవం దగ్గరే సంతకాలు చేయించి కుదరక తండ్రి పేరుతో పార్టీ పెట్టి, ఆపై విచారణల నుంచి తప్పించుకోవడానికి అదే తండ్రి పేరును కేసుల్లోకి లాగి, ఆయన ఆత్మకు భూమిపైనే పున్నామ నరకాన్ని ప్రసాదిస్తున్న ఈ పుత్రరత్నం జగన్ తీరు నిజంగా జుగుప్సాకరం. ఏ తండ్రికీ ఈ దౌర్భాగ్యం రాకూడదు!

మొన్నటి వరకూ బీజేపీ ప్రభుత్వంకు వ్యతిరేకంగా హెడ్డైన్స్ పెట్టే ధైర్యం చెయ్యలేని సాక్షి, ఇవ్వాళ ఏక పక్షంగా విషం కక్కడం గమనార్హం.

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
మహానాడు
Mahanaadu Media


# రైతులను వదిలేసి ఢిల్లీకి యాత్రలా?

**- మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్, మహానాడు: రైతుల సమస్యల పరిష్కారానికి కీలకమైన మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై చర్చించడంతో పాటు రైతువేదికల్లో రైతులతో వీడియో సమా వేశం నిర్వహిస్తామని ప్రకటించి, ఆ కార్యక్రమాలను వాయిదా వేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.



అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తున్నారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. మొన్నటివరకు ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు రెండో పంట వేయవద్దని ముఖ్యమంత్రి, మంత్రులే రైతులను హెచ్చరించడం దుర్మార్గమని మండిపడ్డారు.

సాగునీరు మాత్రమే కాకుండా కనీసం తాగునీరు కూడా అందించలేమని, విద్యుత్ కూడా ఇవ్వలేమని ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయం, ప్రజల విషయంలో చేతులెత్తేసినట్లు స్పష్టమవుతోందన్నారు. సాగునీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎత్తిపోతల మోటార్లను నిలిపివేసి రైతాంగం, వ్యవసాయ రంగం నడ్డి విరిచారని విమర్శించారు.

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలు ఎండిపోతున్నాయని, తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోవడంతో రైతులు ఆవేదనతో రోడ్లపైకి వస్తున్నారని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో కాంగ్రెస్ నాయకులు విమానాలు ఎక్కి ఢిల్లీకి వెళ్తున్నారని విమర్శించారు.

జాతీయ పార్టీలను నమ్ముకుంటే తెలంగాణకు అధోగతి తప్పదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనేకసార్లు చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాల కంటే జాతీయ పార్టీలకు వ్యక్తిగత ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, బీఆర్ఎస్‌కు మాత్రమే తెలంగాణ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని కేసీఆర్ స్పష్టం చేశారని తెలిపారు.

కేసీఆర్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయం, రైతులు రాజుల్లా బతికిన పరిస్థితులు కాంగ్రెస్ పాలనలో తిరిగి వెనుకటి ఇబ్బందులకు చేరుకున్నాయని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జాతీయ పార్టీల మోసపూరిత హామీలు, అబద్ధాలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తులో తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెబుతుందని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యలపై చర్చించాల్సిన కీలక సమావేశాన్ని వాయిదా వేసి సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్-చోరీకి మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

మొదటి పేజీ తరువాయి..

సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు.

### గతంలో ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్

గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించారని సీఎం గుర్తు చేశారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు.

అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సీఎం విమర్శించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ



వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు.

ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని అన్నారు. అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీఎం హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

### పారదర్శకత కోసమే నాడు ఎన్నికల సంఘంలో మార్పులు

గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం



ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు.

మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు. నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని సీఎం మండిపడ్డారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో నిష్పక్షపాతానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జ్ఞానేశ్‌తో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని సీఎం ఆరోపించారు.

### దళితులు, గిరిజనులు, పేదల ఓట్లే లక్ష్యమా?

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశ యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని





సీఎం మండిపడ్డారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు.

మొదట్లో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తగినంతగా దృష్టి పెట్టలేదని, తాజా పరిణామాలతో పరిస్థితి తీవ్రత అందరికీ అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు ఈ అంశంపై గొంతెత్తడమే ఇందుకు సంకేతమని సీఎం వ్యాఖ్యానించారు.

### మోదీ, అమిత్ షాల మౌనం ఎందుకు?

జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

ఢిల్లీలో భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారో వివరించాలన్నారు. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో జరుగుతున్న చర్యల వల్ల రాజకీయంగా లబ్ధి పొందుతున్నది బీజేపీ మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీకి కొంతమేర బలం ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయాలకు ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు కూడా కారణమనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు.

### జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయి?

2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.

2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు. జనాభా పెరిగితే ఓటర్ల సంఖ్య పెరగాలా? తగ్గాలా? అన్నది సాధారణ ప్రశ్నేనని, దీనికి ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.

### ఓటు ఉన్నవారు.. లేనివారంటూ రెండు వర్గాలా?

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ప్రతి పౌరుడికీ అందాలని, పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు.

### రాహుల్ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం

ఆనాడు 'సైమన్ గో బ్యాక్' నినాదం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగుతున్న 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు, ఓటు హక్కును కాపాడేందుకు దోహదపడుతుందన్నారు. గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని, ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ 'ఓట్ చోరీ' ప్రచారం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని సీఎం తెలిపారు.

అందులో భాగంగానే తాము ఢిల్లీకి వచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు. ఈ పోరాటాన్ని మరో స్వాతంత్ర్య ఉద్యమం మాదిరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, దళితులు, గిరిజనులకు ఓటు హక్కు ఉండకూడదనే అభిప్రాయాలను బీజేపీ, దాని సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్ నాయకులు గతంలో వ్యక్తం చేశారని ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి ఆరోపించారు. అయితే, బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎం అన్నారు.

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్, ఇండియా కూటమి తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ బాటలోనే మోదీ

**- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఎత్తేసిన కేసీఆర్‌కు పట్టిన గతే**

**- జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు విధించిన మోదీకి పడుతుంది**

**- ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు : మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, మహానాడు: ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగం కల్పించిన హక్కు అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఒక వేదికగా ఉండేదని మంత్రి గుర్తు చేశారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజల నిరసన హక్కును కాలరాస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌ను ఎత్తివేసిందని విమర్శించారు.

తమ నిరసన తెలిపే అవకాశం లేకుండా చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని మంత్రిగారి పేర్కొన్నారు.

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన అదే విధానాన్ని ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని మంత్రి పొంగులేటి విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు చారిత్రకంగా ఉపయోగించుకున్న జంతర్‌మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు.

కేసీఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిరసన వేదికను తొలగిస్తే.. మోదీ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ఆంక్షలు విధిస్తోందని, ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటేనని మంత్రి మండిపడ్డారు.

ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాల గొంతును వినిపించకుండా, నిరసనలకు వేదిక లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజల గొంతును అణచివేయాలని చూసిన కేసీఆర్‌కు ఎలాంటి రాజకీయ పరిణామం ఎదురైందో.. అదే పరిస్థితి భవిష్యత్‌లో నరేంద్ర మోదీకి కూడా ఎదురవుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను ఎత్తేసిన కేసీఆర్‌కు పట్టిన పరిస్థితి.. జంతర్‌మంతర్‌పై ఆంక్షలు విధిస్తున్న మోదీకి పడుతుంది. ప్రజల గొంతును అణచివేసే ప్రతి పాలకుడికి చివరకు ప్రజల తీర్పే సమాధానం" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

# 3,296 కోట్ల రేడియల్-2 నిర్మాణ టెండర్లలో భారీ అవినీతి

మొదటి పేజీ తరువాయి..

తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.

తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు.

మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.

టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు.

గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి

**- తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**- ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంది.. వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలి**

**- జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించాలి**

**- ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నాం**

**- ఎల్‌నినో ప్రభావంపై రైతులు, జిల్లా కలెక్టర్ల సదస్సులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, ప్రస్తుత పంటలను కాపాడేందుకు, రానున్న యాసంగి సీజన్‌లో నష్టాలను నివారించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ రోజు జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్లు మరియు రైతులతో నిర్వహించిన సదస్సులో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మరియు మంత్రి తుమ్మల పాల్గొని ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, యాసంగి పంటల ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు.

ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, దీని ప్రభావంతో వర్షపాతం తగ్గడం, నీటి నిల్వలు పడిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని మంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం ఏప్రిల్ నుంచే ముందస్తు చర్యలు ప్రారంభించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, పంటల పరిస్థితుల ఆధారంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో వరి సాగు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ముఖ్యంగా నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనగ, పెసర, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రాంతీయ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిశీలించి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒకే విధమైన పరిస్థితులు లేవని, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. ఐఎండీ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, భూగర్భజల శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వాస్తవ సమాచారాన్ని రైతులకు వివరించాలని ఆదేశించారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, భూగర్భజలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, రానున్న వర్షాల అంచనాలను పరిగణనలోకి తీసుకొని రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు. "రైతులకు అర్థమయ్యే భాషలో, వాస్తవ పరిస్థితులను వివరించి చెబితే వారు తప్పకుండా అర్థం చేసుకుంటారు. క్షేత్రస్థాయి పరిస్థితులను దాచకుండా తెలియజేయాలి. రైతులు నష్టపోకుండా సరైన పంటల ఎంపిక చేసుకునేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి" అని మంత్రి సూచించారు.

# రూ.50 వేల కోట్ల అవినీతి సంపాదనలో భాగంగానే ఈ స్కూల్‌లో పెట్టుబడులు పెట్టారా?

**- రూ.2.5 లక్షల ఫీజు వసూలు చేస్తూ విద్యార్థులపై భారం మోపాలని చూస్తున్నారా?**

**- విద్యను వ్యాపారం చేయొద్దన్న సీఎం రేవంత్ ఇప్పుడు వారి కుమార్తె కార్పొరేట్ స్కూల్ ఎందుకు నిర్మాణం చేస్తున్నారో సమాధానం చెప్పాలి**

**- సీఎం రేవంత్ కుమార్తె ఎనుముల నైమిశా రెడ్డి నిర్మాణం చేస్తున్న కార్పొరేట్ స్కూల్ ఎదుట మన్నె క్రిషాంక్ బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రెస్ మీట్**



హైదరాబాద్: బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిషాంక్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన కార్పొరేట్ స్కూల్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పలు ప్రశ్నలు లేవనెత్తారు. మెడికవర్ ఆసుపత్రి అమ్మడం ద్వారా వచ్చిన నిధులను, రేవంత్ రెడ్డి కుమార్తె నైమిషా రెడ్డి మైండ్ వాల్ట్ కార్పొరేట్ స్కూల్ సంస్థలో పెట్టుబడులుగా పెట్టారనే అనుమానాల పై స్పష్టత ఇవ్వాలని క్రిషాంక్ డిమాండ్ చేశారు. రూ.50 వేల కోట్ల అవినీతి , అక్రమ సంపాదనలో భాగంగానే ఈ స్కూల్‌లో పెట్టుబడులు పెట్టారా అని ప్రశ్నించారు.

కొంపల్లి వద్ద ఉన్న ఈ స్కూల్‌ను హైదరాబాద్ లో కొల్లూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారని, రూ.2.5 లక్షల ఫీజు వసూలు చేస్తూ విద్యార్థులపై భారం మోపాలని చూస్తున్నారా అని నిలదీశారు. 2025 జూలై 4న స్కూల్‌కు సంబంధించిన భూమి కొనుగోలు జరిగినట్లు సేల్ డీడ్‌లో ఉందని పేర్కొన్న క్రిషాంక్, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే భూమి కొనుగోలు చేయడానికి, ఇంత పెద్ద ఎత్తున భారీ స్కూల్ నిర్మాణానికి నిధుల వివరాలను డిమాండ్ చేశారు. ఈ నిర్మాణాలు మైండ్ వాల్ట్ వెంచర్స్ సంస్థ ద్వారా జరుగుతున్నాయని, రంగారెడ్డి జిల్లాలోని సంస్థ రిజిస్టర్డ్ చిరునామాలో నైమిషా రెడ్డి, దుంప శిరీష, దుంప బ్రహ్మానంద రెడ్డి, బేతి విజయశ్రీ, శిరీష పరంకుశం పేర్లు ఉన్నాయని క్రిషాంక్ ఆధారాలతో తెలిపారు. నైమిషా రెడ్డి మినహా మిగతా వ్యక్తులు మెడికవర్ ఆసుపత్రి డైరెక్టర్లుగా ఉన్నారని పేర్కొంటూ, ఈ సంబంధాలపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

స్కూల్‌లో పెట్టుబడుల మూలాలు, భూమి కొనుగోలు వివరాలు, సంబంధిత సంస్థల ఆర్థిక లావాదేవీలపై పారదర్శకత పాటించి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని మన్నె క్రిషాంక్ కోరారు. విద్యాశాఖ మంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి గురుకుల పాఠశాలలను పూర్తిగా పట్టించుకోకుండా, గతంలో విద్యను వ్యాపారంగా చేయవద్దని ఉపన్యాసాలు ఇచ్చి, ఇప్పుడు వారి అమ్మాయి తో కార్పొరేట్ స్కూల్ ల వ్యాపారం చేయించడం ఒక ముఖ్యమంత్రిగా అధికార దుర్వినియోగమే.

తమ్ముడు కొండల్ రెడ్డి కి 200 కోట్ల భూమి అప్పగించడం, మరో తమ్ముడు జగదీశ్వర్ రెడ్డి బోగస్ కంపెనీతో వెయ్యికోట్ల ఒప్పందం చేసుకోవడం, కొరియా పర్యటనకు వెళ్లి మరి సతీమణి పేరుతో గీత హ్యుండై 5 షోరూంలు తెరిపించడం, ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకోకుండా అల్లుడి మ్యాక్స్ బివెన్ ఫార్మా, మెడికవర్ ఆసుపత్రి ని దగ్గరుండి ప్రోత్సహించడం, ఇప్పుడు ఏకంగా రేవంత్ అమ్మాయి కార్పొరేట్ స్కూల్ నిర్మించడం ఇవన్నీ కేవలం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన రెండున్నర సంవత్సరాలకి తన ఆస్తులు 50000 కోట్లకు పెరగడంపై ఎందుకు కాంగ్రెస్ వారు నోరు మెదపడం లేదు?

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
మహానాడు ®
Mahanaadu Media
9
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం అక్టోబర్ 13, 2026

# రేవంత్ రెడ్డి పరిపాలనను గాలికొదిలేసి గోవాకు ఎందుకు వెళ్లాడు?

- కాంగ్రెస్ మీటింగ్ ముసుగులో అక్కడ రిసార్టులలో ఎవరిని కలిశాడు?
- ఏ వ్యాపారవేత్తలతో చీకటి డీల్స్ కుదుర్చుకున్నాడు?
- హరీశ్ రావు పై నోరు పారేసుకుంటే నాలుక చీరేస్తాం.
. రేవంత్ పతనానికి సిద్దిపేట నుంచే నాంది:
- బీర్ల ఐలయ్యపై మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఫైర్



**హైదరాబాద్:** బీర్ల ఐలయ్య.. నువ్వు నీళ్లు తాగి మాట్లాడుతున్నవా? లేక అధికార మత్తులో బీర్లు తాగి మాట్లాడుతున్నవా? సిద్దిపేటలో హరీశ్ రావు నిర్వహించిన దశాబ్ది సభను చూసి కాంగ్రెస్ పాలకులకు కళ్లు బైర్లు కమ్మినయ్. మద్యం కంపెనీలకు, లిక్కర్ డిస్టిలరీలకు ఇవ్వడానికి పుష్కలంగా నీళ్లుంటాయి కానీ.. రైతుల పంటలకు ఇవ్వడానికి ఎల్‌నినో సాకులా? హాస్టళ్లలో పేద పిల్లల నోటికాడి బువ్వను కొట్టి రూ.800 కోట్ల టెండర్లలో 20% కమీషన్లు మింగుతున్న రేవంత్ అవినీతికి సిగ్గుపడాలి.

కాంగ్రెస్ మీటింగ్ ముసుగులో గోవా రిసార్టులలో రేవంత్ రెడ్డి ఎవరితో చీకటి బేరసారాలు నడిపాడో సమాధానం చెప్పే దమ్ముందా? సిద్దిపేట అభివృద్ధిని వేలెత్తి చూపే నైతిక హక్కు కాంగ్రెస్ బ్రోకర్లకు లేదు.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు..

సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల ముగింపు సభ విజయవంతం కావడంతో ఓర్వలేక ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేసిన దిగజారుడు వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి దగ్గర బానిసత్వాన్ని, గురుభక్తిని నిరూపించుకోవడానికి బీర్ల ఐలయ్య పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు.

బీర్ల ఐలయ్య.. నువ్వు అసలు స్పృహలో ఉండి మాట్లాడుతున్నావా? లేక అధికార మత్తులో, బీర్లు తాగిన మైకంలో మాట్లాడుతున్నావా? సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి హరీశ్ రావు కి నీరాజనం పలికితే.. ఆ ప్రజాభిమానాన్ని చూసి మీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయా? సిద్దిపేట నుంచే రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన అంతానికి ప్రజా ఉద్యమం మొదలవుతుందని హరీశ్ రావు హెచ్చరించగానే మీ వెన్నులో వణుకు మొదలై ముచ్చెమటలు పడుతున్నాయా?

గతాన్ని గుర్తుచేసుకో బీర్ల ఐలయ్యా.. ఆనాడు కొడంగల్ వెళ్లి నీ గురువు రేవంత్ రెడ్డిని గూబ గుయ్యిమనిపించి, రాజకీయంగా మట్టికరిపించింది హరీశ్ రావు అన్న విషయం గుర్తు పెట్టుకో. సిద్దిపేట అభివృద్ధి గురించి మాట్లాడే స్థాయి, అర్హత నీకు ఎక్కడిది? సిద్దిపేటలో మెడికల్ కాలేజ్, అగ్రికల్చర్ కాలేజ్, దేశానికే ఆదర్శమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రిజర్వాయర్ల నిర్మాణం చేసింది హరీశ్ రావు .

గురుకులాల్లో, సంక్షేమ హాస్టళ్లలో నాసిరకం భోజనం తిని పేద బిడ్డలు ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రుల పాలవుతుంటే.. 800 కోట్ల నిత్యావసర సరుకుల టెండర్లలో బ్లాక్‌లిస్ట్ సంస్థకు రెడ్ కార్పెట్ వేసి 20% కమీషన్లు నొక్కుకుంటున్న చరిత్ర మీది. విద్యార్థులకు పెట్టే తిండిలోనూ కమీషన్లకు కక్కుర్తి పడుతున్న మీ అవినీతి బాగోతంపై ప్రజలు ఛీ కొడుతున్నారు. అసలు మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనను గాలికొదిలేసి గోవాకు ఎందుకు వెళ్లాడు?

కాంగ్రెస్ మీటింగ్ ముసుగులో అక్కడ రిసార్టులలో ఎవరిని కలిశాడు. ఏ వ్యాపారవేత్తలతో చీకటి డీల్స్ కుదుర్చుకున్నాడు? దీనిపై సోషల్ మీడియాలో, ప్రజల్లో వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మీ కాంగ్రెస్ నేతలకు ఉందా? ఎదురుదాడి చేసి మీ అవినీతిని కప్పిపుచ్చుకోవాలని చూస్తే, చూస్తూ ఊరుకోం.

# వీసీ భార్య మితిమీరిన జోక్యం

- జేఎన్‌టీయూ వీసీ భార్య సుజనా రెడ్డి చేసిన ఫిర్యాదు అవాస్తవం
- మహిళా ప్రొఫెసర్లను దూషించిన అంశంపై వీసీని ప్రశ్నించా
-ఫోన్ రికార్డులు బయటపెడితే వాస్తవాలు తెలుతాయి
- జేఎన్‌టీయూలో అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ జరపాలి
- యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చే చర్యలకు పాల్పడవద్దు
- నాపై చేసిన ఫిర్యాదును తీవ్రంగా ఖండిస్తున్నా
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్:** జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి భార్య సుజనా రెడ్డి తనపై చేసిన ఫిర్యాదును తీవ్రంగా ఖండి స్తున్నానని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌లో తనపై తిట్టినట్లు, బెదిరించినట్లు సుజనా రెడ్డి ఫిర్యాదు చేసిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. సుజనా రెడ్డి ఎవరో తనకు తెలియదు. ఆమెను ఎప్పుడూ చూడలేదు. ఆమెతో ఎప్పుడూ మాట్లాడలేదని తెలిపారు.

నేను జేఎన్‌టీయూ వీసీకి ఫోన్ చేసినప్పుడు, వీసీ బాత్రూమ్‌లో ఉన్నారని ఎవరో ఫోన్ ఎత్తి చెప్పారు. ఏదైనా విషయం ఉంటే చెప్పాలని వారు అనడంతో, నేను వీసీతోనే మాట్లాడతానని చెప్పి ఫోన్ పెట్టేశాను. ఆ తర్వాత వీసీతో మాట్లాడాను. సీనియర్ ప్రొఫెసర్లను, ముఖ్యంగా మహిళా ప్రొఫెసర్లను దూషించడానికి కారణాలేమిటని ప్రశ్నించాను. నాపై ఏదైనా కోపం ఉంటే నన్ను ప్రశ్నించవచ్చు. అంతే కానీ, మహిళా ప్రొఫెసర్లను ఎందుకు దూషించారని వీసీని అడిగాను. దీనికి వీసీ తప్పు జరిగిందని అంగీకరిస్తూ క్షమాపణ కోరాడు.తాను తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత లేఖ ఇస్తానని చెప్పారు.ఇది జరిగిన వాస్తవం..

వీసీ క్షమాపణ పత్రం ఇస్తానని చెప్పినప్పటికీ, మరుసటి రోజు సాయం త్రం వరకు అది రాకపోవడంతో మహిళా ప్రొఫెసర్లు పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసారు. అయితే ఆ ఫిర్యాదుకు సంబం ధించిన సమా చారాన్ని పోలీసులకు సరిగా అందించకుండా, తన భార్యతో తనపై ఫిర్యాదు చేయించారు. మహిళా ప్రొఫెసర్లను వీసీ దూషిం చారా లేదా అనే విషయాలను పోలీసులు సమగ్రంగా విచారిం చాలి. అలాగే నేను వీసీతో ఫోన్‌లో ఏం మాట్లాడాననే విషయం కూడా కాల్ రికార్డులను పరిశీలిస్తే స్పష్టమవుతాయి. మహిళా ప్రొఫెసర్లతో వీసీ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై నిజానిజాలు తేల్చేందుకు సంబంధిత సీసీటీవీ ఫుటేజీని కూడా పోలీసులు పరిశీలించాలని కోరారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ జేఎన్‌టీయూ..ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థు లు ఈ సంస్థలో విద్యనభ్యసించి తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు తమ కళాశాలలు కూడా అనుబంధంగా కొనసాగుతున్నాయి.

అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు మరింత పెరిగాయి. వీసీ తన భార్యను అడ్డుపెట్టుకొని వసూళ్లకు పాల్పడుతున్నారు. యూనివర్సిటీ క్వార్టర్‌ను బార్‌లా మార్చారు. జూబ్లీహిల్స్ క్లబ్, గోల్ఫ్ క్లబ్ కేంద్రాలుగా చేసుకొని వారాంతాల్లో వసూలు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

యూనివర్సిటీలో కాంట్రాక్టర్ల కేటాయింపు, డైరెక్టర్లు, డీన్ల వంటి కీలక పదవుల నియామకాలు, బదిలీలు, యూని వర్సిటీకి సంబంధించిన విధానపరమైన నిర్ణయాల్లో వీసీ భార్య మితిమీరిన జోక్యం చేసుకుం టున్నారు. అతి కొద్దిమంది వ్యక్తులు డబ్బులు చెల్లించి పదవులు పొందు తున్నారు. విద్యాబోధన, పరిశోధన వంటి ప్రధాన బాధ్య తలను పక్కనపెట్టి జేజమ్మకు జైజైలు పలుకుతున్నారు.

# లంకెలపాలెం -పరవాడ రోడ్లు నిర్మాణం వెంటనే చేయాలి

- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు



**పరవాడ:** లంకెలపాలెం నుండి పరవాడ పరవాడ ఎన్టిపిసి రోడ్లను వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని పెద్ద పెద్ద గోతులతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు అనుభవిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్ కి సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆర్ అండ్ బి ఈ ఈ రంగయ్య కి ఫిర్యాదు అందజేయడం జరిగింది. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గని శెట్టి కోరారు.

లంకెలపాలెం బ్రిడ్జి మధ్యలో పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయని ఎస్సీ జడ్ జంక్షన్ సింహాద్రి జంక్షన్ ఎంఆర్‌ఓ ఆఫీస్ జంక్షన్ సబ్ స్టేషన్ సినిమాలు జంక్షన్ ఎన్ టి పి సి జంక్షన్ సోమనాయుడుపాలెం ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతుల వలన ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడం కష్టంగా మారిందని.. దుమ్ము దూళి కంట్లో పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హిందుజా బొగ్గు లారీలు, ఎన్టిపిసి ప్లేయష లారీలు అధిక లోడుతో ప్రయాణించడం వలన రోడ్లు ధ్వంసం అవుతున్నా యని, వెంటనే రోడ్ల మరమ్మత్తు చేయడంతో పాటు పరిమితికి మించి అధిక లోడుతో వెళ్లే వాహనాలను నిలుపుదల చేయాలని గని శెట్టి కోరారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపమని వెంటనే రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడానికి పరిశీలిస్తున్నామని ఈ ఈ రంగయ్య గని శెట్టి కి హామీ ఇచ్చారు.

# మహాత్ముల దర్గాలను బుల్డోజర్లతో తొలగిస్తే ప్రజాగ్రహం తప్పదు

- 300 ఏళ్ల చరిత్ర కలిగిన మంగళగిరి హజరత్ సయ్యద్ మాలిక్ హుస్సేన్ అవులియా దర్గాను కాపాడాలి
-- రోడ్డు డిజైన్‌లో మార్పులు చేయాలి
- కలెక్టర్ సీఎం సాయి కాంత్ కు వర్మ వినతిపత్రం
- మంత్రి లోకేష్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఇన్‌చార్జి షేక్ నూరి ఫాతిమా హెచ్చరిక

**గుంటూరు:** మైనారిటీల పక్షపాతులమని మాటల్లో చెప్పుకుంటున్న కూటమి పాలకులు, ఆచరణలో మైనారిటీల మనోభావాలను దెబ్బతీస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఇన్‌చార్జి షేక్ నూరి ఫాతిమా ఆరోపించారు. అమరావతి రాజధానికి వెళ్లే స్పీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం పేరుతో మంగళగిరిలో సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన హజరత్ సయ్యద్ మాలిక్ హుస్సేన్ అవులియా దర్గాను తొలగించాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

దర్గా పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చేపట్టిన ఉద్యమంలో భాగంగా పార్టీ నాయకులు సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా ప్రాముఖ్యతను, భక్తుల మనోభావాలను, దాని పరిరక్షణ ఆవశ్యకతను కలెక్టర్‌కు వివరించారు.

కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ ను కలిసిన వారిలో వైసీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు వి. ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ అబ్దుల్ హాఫిజ్ ఖాన్, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాల్ రెడ్డి, మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ బాజీ షహిద్ బాబా, దర్గా ట్రస్టీ మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ ,సీఎం సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ తాను కూడా సూఫీ దర్గాలను సందర్శిస్తుంటానని, గతంలో కడప దర్గాను సందర్శించినప్పుడు కోరుకున్న కోరిక నెరవేరిందని తెలిపారు. మంగళగిరి దర్గా అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, దాని పరిరక్షణ అవసరాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు.

అనంతరం మీడియాతో నూరి ఫాతిమా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. గుంటూరులోని అంజుమన్ భూముల విషయంలోనూ వివాదాలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ, ఇప్పుడు మంగళగిరిలోని చారిత్రక దర్గాకు ముప్పు ఏర్పడటం ఆందోళనకరమన్నారు.

"మహాత్ముల దర్గాల విషయంలో ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. దర్గాను తొలగించే నిర్ణయాన్ని విరమించుకుని, దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి" అని నూరి ఫాతిమా డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కోరారు.

వైసీపీ మైనారిటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ అబ్దుల్ హాఫిజ్ ఖాన్, వైసీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు వి. ఖాదర్ బాషా., మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన చారిత్రక దర్గాను తొలగించే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, రోడ్డు డిజైన్‌లో స్వల్ప మార్పులు చేయడం ద్వారా దర్గాను సంరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా ప్రారంభం అయిన శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

- బాలికలకు నవ దుర్గ పూజలు నిర్వహించిన లక్ష్మి పద్మావతి



**చీమకుర్తి:** శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్న వరాత్రుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి.మాజీమంత్రి డా. శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు అందుకున్నారు.

శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన,అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం,ఉభయదాతలచే కుంకుమ పూజ, నైవేద్యం,హారతి, తీర్థప్రసాదాల వినియోగం తొమ్మిది మంది బాలికలకు నవదుర్గ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.సోమవారం రెండవ రోజు శ్రీ గాయత్రి దేవి అలంకారం మరియు సామూహిక హరిద్రా అభిషేకంతో భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం కలిగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

దేవి శరన్నవరాత్రుల పునస్కారించుకొని శ్రీ హరిహర క్షేత్రం విద్యుత్ దీపాలతో అలంకరణతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం,వాహన సౌకర్యం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు, సువర్చల,అరుణ,ఆర్యవైశ్య మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతికి వరల్డ్ రికార్డ్స్ ఇండియా సీఈఓ పవన్ సోలంకి

75 గంటల పాటు 1,000 మంది డప్పు కళాకారుల నిర్విరామ ప్రదర్శన
రికార్డు నమోదును పరిశీలించేందుకు తిరుపతికి రాక
- స్వాగతం పలికిన ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్






**తిరుపతి:** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతిలో 1,000 మంది డప్పు కళాకారులు 75 గంటల పాటు నిర్విరామంగా డప్పు వాయిద్యాలు మ్రోగిస్తూ ప్రపంచ రికార్డు సాధించే లక్ష్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వరల్డ్ రికార్డ్స్ ఇండియా సీఈఓ పవన్ సోలంకి తిరుపతికి చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఆయనకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ ఘనంగా స్వాగతం పలికారు.

భారీ సంఖ్యలో డప్పు కళాకారులు ఒకేసారి పాల్గొంటూ, 75 గంటల పాటు నిరంతరంగా ప్రదర్శన ఇవ్వడం ఈ కార్యక్రమంలోని ప్రత్యేకత. కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శనను పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ప్రపంచ రికార్డు నమోదుకు సంబంధించిన అంశాలను పవన్ సోలంకి లెక్కించనున్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను ప్రోత్సహించడంతో పాటు, డప్పు కళాకారుల ప్రతిభను ప్రపంచస్థాయిలో చాటిచెప్పే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# ఎల్‌నినో కంటే ఎల్ కాంగో డేంజర్

- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించాలి
- రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు
బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- కొందుర్గులో బీఆర్ఎస్ మీడియా సమావేశం



**కొందుర్గు:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎండిపోతున్న పంటలు, విద్యుత్ కోతలు, ఎరువుల కొరత తదితర అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాల కొరత, విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుల పట్ల, తెలంగాణ జాతిపితగా తాము భావించే కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి, దుస్తులు విప్పించి జైలుకు పంపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలి.

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత, విద్యుత్ కోతలు, ఎల్‌నినో ప్రభావం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలుపైనా విమర్శలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్ట వివరాలతో నివేదికలు రూపొందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అంజయ్య యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం మిగిలిన కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

# తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుమల కొండపై ప్రతిఏటా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. కలియుగదైవం ఐన వేంకటేశ్వరుడు పాపాలను దహించి ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాడని ప్రతీతి. తిరుమల కొండపై సౌరమానం ప్రకారం కన్యామాసంలో తొమ్మిదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఇవి సాధారణంగా శరన్నవరాత్రులలోనే ప్రారంభమై విజయదశమితో పూర్తవుతూ ఉంటాయి. బ్రహ్మోత్సవ వేళ వేంకటేశ్వరుడు ఇద్దరు దేవేరులతో వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తకోటిని తరింపచేస్తాడు.

కనులకు మిరుమిట్లు గొలిపే దీపతోరణాలతో, అఖండజ్యోతులతో, జిగేల్మనే నవరత్నహార సంచయంతో, కర్ణపేయమైన వేదఘోషలతో, భక్తిభావ లహరులైన పాటలతో, గోవిందనామాలతో సప్తగిరులు శోభిల్లుతాయి. దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు స్వామిని తనివితీరా దర్శించుకుని, కోరికలను నివేదించుకోవడానికి తిరుమలకు తరలి వస్తారు.స్వామివారికి తొలిసారిగా ఈ బ్రహ్మోత్సవాన్ని సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే జరిపించినట్లు భవిష్యోత్తర పురాణం పేర్కొంటోంది. బ్రహ్మదేవుడు స్వయంగా ఆరంభించిన ఉత్సవాలు కావటంతో, ఇవి 'బ్రహ్మోత్సవాలు' అయ్యాయని అంటారు. తిరుమల





శ్రీవారి బ్రహ్మోత్సవాలలో వాహన సేవల విశిష్టత ఈ విధంగా ఉంటుంది.

పెద్ద శేష వాహనం ఆదిశేషునిపై స్వామివారు దర్శనమిస్తూ, భక్తులకు దైవ రక్షణను, శరణాగతి భావాన్ని తెలియజేస్తారు.

చిన్న శేష వాహనం శేషుని సేవాభావం, స్వామివారిపై అచంచల భక్తికి ప్రతీక. హంస వాహనం హంస వివేకానికి, మంచిచెడులను గుర్తించే జ్ఞానానికి ప్రతీక.

సింహ వాహనం ధైర్యం, పరాక్రమం, దుష్టశక్తులపై విజయానికి ప్రతీక.

ముత్యపు పందిరి వాహనం ముత్యాల తెల్లదనం పవిత్రతకు, ప్రశాంతతకు ప్రతీకగా భావిస్తారు.

కల్పవృక్ష వాహనం కల్పవృక్షం కోరికలను తీర్చే దివ్య వృక్షానికి ప్రతీక. భక్తుల అభీష్టాలను స్వామివారు అనుగ్రహిస్తారనే విశ్వాసాన్ని సూచిస్తుంది.

సర్వభూపాల వాహనం సమస్త రాజులకు రాజైన శ్రీనివాసుడు లోకాలను పరిపాలించే దైవమని తెలియజేస్తుంది.

మోహినీ అవతార అలంకారం విష్ణుమూర్తి మోహినీ రూపాన్ని స్మరింపజేస్తూ, దైవ మాయా వైభవాన్ని తెలియజేస్తుంది.

గరుడ వాహనం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవమైన సేవల్లో ఒకటి. గరుడుడు స్వామివారి పరమ భక్తుడు, వాహనుడు. ఈ సేవకు భక్తులు విశేష ప్రాధాన్యం ఇస్తారు.

హనుమంత వాహనం శ్రీ హనుమంతుని అచంచల భక్తి, సేవాభావం, ధైర్యం, వినయానికి ప్రతీక.

అశ్వ వాహనం వేగం, శక్తి, కార్యదీక్షకు ప్రతీకగా భావిస్తారు.

స్వర్ణ రథోత్సవం బంగారు రథంపై స్వామివారి ఊరేగింపు దివ్య వైభవానికి, భక్తుల ఆనందానికి ప్రతీక. చంద్రప్రభ వాహనం చంద్రుని శీతల కాంతిలా మనసుకు ప్రశాంతత, చల్లదనం కలగాలని సూచిస్తుంద సూర్యప్రభ వాహనం సూర్యుని తేజస్సు, శక్తి, జ్ఞానం, అజ్ఞానాంధకారాన్ని తొలగించే దైవ మహిమకు ప్రతీక.

చక్రస్నానం శ్రీవారి సుదర్శన చక్రానికి పవిత్ర స్నానం నిర్వహించే ఈ ఘట్టం బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైనది. భక్తులు దీనిని అత్యంత పవిత్రంగా భావిస్తారు.

ప్రతి వాహనం ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. భక్తి, ధర్మం, జ్ఞానం, ధైర్యం, వినయం, శరణాగతి వంటి సద్గుణాలను మన జీవితాల్లో ఆచరించాలని ఈ ఉత్సవాలు తెలియజేస్తాయి.

శ్రీవారి దివ్య కృప సర్వజనులపై ఉండాలని కోరుకుందాం.

గోవిందా... గోవిందా... గోవిందా...

- ములుకుట్ల సువర్చల

Published by Bodepudi Vignesh, Managing Director on behalf of Mahanadu Media Pvt. Ltd. Editor: Marthi Subrahmanyam Phone: 9705311144, 8538888999